# విశాల భారతి

7-03-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 62


## ఇరాన్ ప్రతీకార జ్వాల!

- శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకను కూల్చేసిన అమెరికా
- ప్రతీకారంగా యూఎస్ బేస్‌లు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి వర్షం
- పర్షియన్ గల్ఫ్‌లో ఆయిల్ ట్యాంకర్లపై దాడులు.. ఇద్దరు భారతీయుల మృతి
- ఇరాన్‌లోని 174 నగరాలపై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులు
- యుద్ధం ఆపేందుకు చైనా మధ్యవర్తిత్వ ప్రతిపాదన.. ఒమన్ శాంతి పిలుపు
- తీవ్ర స్థాయిలో పెరుగుతున్న మరణాల సంఖ్య.. ఎటు చూసినా శవాల దిబ్బలే

02



# దేశంలో పులి.. ట్రంప్ ముందు పిల్లి..!

### రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత్‌కు నెల రోజుల పాటు అమెరికా అనుమతి

- ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో హార్ముజ్ జలసంధి దిగ్బంధం ముప్పు
- చమురు రవాణా నిలిచిపోతే దేశంలో ఇంధన ధరల పెరుగుదలపై ఆందోళన
- ఒకప్పుడు అమెరికాను ఎదిరించిన భారత్, నేడు సాగిలపడుతోందన్న విమర్శలు
- ఇరాన్ నౌకపై దాడి జరిగినప్పుడు భారత్ మౌనం వహించడంపై చర్చ
- అదానీపై అమెరికాలో నమోదైన కేసులే మోడీని భయపెడుతున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలు

> భారతదేశం తన సొంత నిధులతో, తనకు నచ్చిన దేశం నుంచి చమురు కొనుగోలు చేయడానికి అమెరికా పర్మిషన్ తీసుకోవాల్సిన దుస్థితి రావడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోలుకు ఒక నెల రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ట్రెజరీ కార్యదర్శి ప్రకటించడం మన దేశ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**విశాలభారతి, అంతర్జాతీయం:**

అసలు మన అవసరాల కోసం మనం నిర్ణయాలు తీసుకోలేమా? మన విదేశాంగ విధానం అమెరికా కనుసన్నల్లో నడుస్తోందా? అన్న సందేహాలు సామాన్యుల్లోనూ కలుగుతున్నాయి. ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం పేరుతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగే ప్రమాదం ఉన్న తరుణంలో అమెరికా ఈ 'ఆఫర్' ఇవ్వడం వెనుక పెద్ద వ్యూహమే కనిపిస్తోంది. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ తన హార్ముజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించడం పెను భారంగా మారనుంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే క్రూడ్ ఆయిల్‌లో దాదాపు 33 శాతం ఈ మార్గం గుండానే వెళ్తుంది. భారత్ దిగుమతి చేసుకునే చమురులో 65 శాతం ఇక్కడి నుంచే రావాలి. ఇరాన్ దిగ్బంధం కారణంగా ఇప్పటికే 15 భారతీయ నౌకలు నిలిచిపోయాయి. చమురు రవాణా ఆగితే దేశంలో డీజిల్, పెట్రోల్ ధరలు చుక్కలను తాకడం ఖాయం. ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి రష్యా మార్గం ఒక్కటే కనిపిస్తున్నా, అక్కడ అమెరికా ఆంక్షల అడ్డంకి భారత్‌ను ఇరకాటంలో పెడుతోంది. గతంలో నెహ్రూ నుంచి ఇందిరా గాంధీ వరకు భారతదేశం ఆర్థికంగా వెనుకబడి ఉన్నా, అంతర్జాతీయ వేదికలపై మన స్వరం గంభీరంగా ఉండేది. ముఖ్యంగా 1971 భారత్‌పాక్ యుద్ధ సమయంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ బెదిరింపులను ఇందిరా గాంధీ లెక్కచేయలేదు. అమెరికా తన ఏడో నౌకాదళాన్ని మిగతా 3లో..




## 'మాదిగ' జాతి రాజ్యం ఏలాలి

- శిల్పా కళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- అణిచివేతకు గురైన వర్గాలే పాలకులు కావాలన్న రేవంత్
- ప్రభుత్వానికి ఉద్యోగులే కళ్లు, చెవులు, బ్రాండ్ అంబాసిడర్లు
- సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం
- విద్యతోనే దళిత జాతుల తలరాతలు మారుతాయని ఉద్ఘాటన
- ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే బాధ్యత అధికారులదేనని వెల్లడి
- మీరా కుమార్ స్ఫూర్తితో సామాజిక న్యాయం చేస్తానని హామీ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై సామాజిక విప్లవానికి నాంది పలకడమే కాకుండా, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. హైటెక్ సిటీ సమీపంలోని శిల్పా కళా వేదికలో మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ నిర్వహించిన సభలో ఆయన చేసిన ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. దశాబ్దాలుగా అణిచివేతకు గురై, చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించిన జాతి, కేవలం కూలీలుగానే మిగిలిపోకూడదని, ఈ రాజ్యాన్ని ఏలే పాలకులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఇది కేవలం ఒక ప్రకటన కాదు, ఒక సామాజిక మార్పుకు పిలుపు అని సీఎం స్పష్టం చేశారు.

ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగుల ప్రాధాన్యతను వివరిస్తూ, తన ప్రభుత్వానికి ఉద్యోగులే కళ్లు, చెవులు అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేవలం 99 రోజుల ప్రయాణంలోనే 'ప్రజా పాలన' ద్వారా సంచలన మార్పులు తీసుకువచ్చామని, ఈ ప్రగతి ప్రస్థానంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ఉన్న పేదవాడికి చేరాలంటే అధికారుల కష్టం ఎంతో అవసరమని ఆయన గుర్తు చేశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాల కోసం సామాన్యులు ఆశగా ఎదురు చూస్తున్నారని, వారి కళ్లలో ఆనందం చూడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా మాదిగ జాతి ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత వెనుకబడి ఉన్న ఈ వర్గానికి ప్రభుత్వ ఉద్యోగులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత పాలనలో ఈ జాతికి కేవలం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చి సరిపెట్టారని, కానీ తమ ప్రభుత్వం వారిని కలెక్టర్లుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా చూడాలని కోరుకుంటోందని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో మాదిగ బిడ్డలు కీలక పాత్ర పోషించాలని, కేవలం సంప్రదాయ వృత్తులకే పరిమితం కాకుండా చట్టసభల్లోనూ, పరిపాలనలోనూ తమ ముద్ర వేయాలని సీఎం ఆకాంక్షను వెలిబుచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పందిస్తూ, ఖజానాను కాపాడుకోవాల్సిన బాధ్యత మిగతా 2లో..

## కోరుట్ల బరిలో మాజీ మావోయిస్ట్ దేవ్ జీ?

- రాజకీయాల్లోకి మావోయిస్ట్ మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధం
- ఈ సంచలన విషయాన్ని వెల్లడించిన సీనియర్ నేత గోనె ప్రకాశ్‌రావు
- అనారోగ్యంతో ఉన్న గణపతి కూడా లొంగిపోవాలని గోనె విజ్ఞప్తి
- తండ్రిని ప్రజాజీవనంలోకి రావాలని కోరిన గణపతి కుమారుడు వాసుదేవరావు
- సీతక్క స్ఫూర్తితో ప్రజాసేవలోకి వచ్చేందుకు మాజీ నక్సలైట్ల మొగ్గు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకోబోతోంది. దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని, సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఇప్పుడు చట్టసభల వైపు అడుగులు వేస్తున్నారు. బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తివంతమైందని భావిస్తున్న ఆయన, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి మిగతా 4లో..



## ఇరాన్‌పై అమెరికా ఉగ్రరూపం

- ఇరాన్ నౌకాదళం లక్ష్యంగా అమెరికా విధ్వంసకర దాడులు
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో రంగంలోకి దిగిన యూఎస్ దళాలు
- మంటల్లో ఇరాన్ భారీ డ్రోన్ క్యారియర్; కుప్పకూలిన రక్షణ వ్యవస్థ
- ఆయుధాలు వీడాలని ఇరాన్ సైన్యానికి ట్రంప్ అల్టిమేటం
- ఇరాన్ నాయకత్వ మార్పులో అమెరికా ప్రమేయం ఉండాల్సిందే

02


## '99 రోజుల' ప్లాన్ ఒక పొలిటికల్ డ్రామా

- 800 రోజుల పాలనలో చేసిందేమీ లేక కొత్త నాటకం
- ప్రజా పాలన దరఖాస్తులు ఇంకా చెత్తబుట్టల్లోనే ఉన్నాయి
- వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికే ఈ 'డైవర్షన్ ప్లాన్'
- రైతు భరోసా లేదు.. బోనస్ ఊసే లేదు.. రైతుల గొంతు కోశారు
- జాబ్ క్యాలెండర్ కాస్త 'జాబ్ లెస్' క్యాలెండర్ అయిపోయింది
- ప్రచార ఆర్భాటం తప్ప.. పారదర్శక పాలన ఎక్కడ ఉంది?



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**


తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దాదాపు 800 రోజుల పాలన పూర్తయిన తర్వాత ఇప్పుడు ప్రగతి ప్రణాళికలు గుర్తుకు రావడం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి మిగతా 3లో..




## సివిల్స్‌లో 'తెలంగాణ' జయకేతనం

- యూపీఎస్సీ 2025 ఫలితాలు విడుదల - మొత్తం 958 మంది ఎంపిక
- తెలంగాణ నుంచి సత్తా చాటిన అభ్యర్థులు - జశ్వంత్ చంద్రకు 23వ ర్యాంకు
- 'రాజీవ్ సివిల్స్ అభయహస్తం' ద్వారా 20 మంది విజేతలు
- మెయిన్స్ రాసిన 202 మందికి రూ. లక్ష చొప్పున సర్కారు సాయం
- విజేతలను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మరో 15 రోజుల్లో యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో పూర్తి మార్కుల వివరాలు

02



## గ్లోబల్ మార్కెట్‌లో మన పంట

- భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్‌లుగా మార్చడమే లక్ష్యం
- జీడిపప్పు, కోకో, శ్రీగంధం వంటి వాణిజ్య పంటలపై ప్రత్యేక ఫోకస్
- రసాయన రహిత సాగు ద్వారా గ్లోబల్ హెల్త్ మార్కెట్‌ను చేజిక్కించుకోవడం
- పీఎం కిసాన్, బీమా పథకాల ద్వారా రైతులకు పెరిగిన భరోసా
- ఒకే పంటపై ఆధారపడకుండా క్రాప్ డైవర్సిఫికేషన్ దిశగా అడుగులు
- పాడి పరిశ్రమలో సాంకేతికత, టీకాలు మరియు గోవర్ధన్ యోజనతో అదనపు ఆదాయం

**విశాలభారతి, జాతీయం:**

భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని అనాదిగా వింటున్న మాట. అయితే, ఆ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవసాయం ఇప్పుడు కేవలం 'జీవనాధారం'గా మాత్రమే మిగిలిపోకూడదని, అది దేశాభివృద్ధికి 'వ్యూహాత్మక శక్తి'గా మారాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. బడ్జెట్ అనంతరం నిర్వహించిన 'వ్యవసాయం, గ్రామీణ పరివర్తన' వెబినార్‌లో ఆయన ప్రసంగిస్తూ, మన రైతులు పండించే మిగతా 3లో..

## ట్రంప్ నెక్స్ట్ టార్గెట్ 'క్యూబా'

- ఇరాన్ యుద్ధం ముగిశాక క్యూబాపై ఫోకస్ పెట్టనున్నట్లు ట్రంప్ సంచలన ప్రకటన
- వైట్ హౌస్ వేదికగా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో పనితీరుపై ప్రశంసలు
- క్యూబాపై విధిస్తున్న ఆర్థిక ఆంక్షలు ఆశించిన ఫలితాలిస్తున్నాయని వెల్లడి
- లాటిన్ అమెరికాలో కమ్యూనిస్ట్ ప్రభుత్వాల అంతమే లక్ష్యంగా అడుగులు
- చమురు, ఆహార సంక్షోభంతో అల్లాడుతున్న క్యూబాను మరింత ఉక్కిరిబిక్కిరి చేసే ప్లాన్
- అంతర్జాతీయ చట్టాలను పక్కనబెట్టి సైనిక చర్యల దిశగా ట్రంప్ యోచన




**విశాలభారతి, అంతర్జాతీయం:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకంపనలు సృష్టించారు. ప్రపంచ దేశాలన్నీ ఇరాన్ పరిణామాలను గమనిస్తుండగానే, ఆయన తన తదుపరి వ్యూహాన్ని బయటపెట్టారు. ఇరాన్‌తో సాగుతున్న సుదీర్ఘ పోరాటం ఒక కొలిక్కి వచ్చిన వెంటనే, అమెరికా తన దృష్టిని క్యూబా వైపు మళ్ళించనుందని ఆయన స్పష్టం చేశారు. వైట్ హౌస్‌లో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ, క్యూబా విషయంలో సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో అద్భుతమైన వ్యూహకర్తగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. మిగతా 3లో..

# ఇరాన్‌పై అమెరికా ఉగ్రరూపం

- ఇరాన్ నౌకాదళం లక్ష్యంగా అమెరికా విధ్వంసకర దాడులు
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో రంగంలోకి దిగిన యూఎస్ దళాలు
- మంటల్లో ఇరాన్ భారీ డ్రోన్ క్యారియర్; కుప్పకూలిన రక్షణ వ్యవస్థ
- ఆయుధాలు వీడాలని ఇరాన్ సైన్యానికి ట్రంప్ అల్టిమేటం
- ఇరాన్ నాయకత్వ మార్పులో అమెరికా ప్రమేయం ఉండాల్సిందే
- పశ్చిమాసియాలో ముగియని యుద్ధ మేఘాలు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియా యుద్ధ క్షేత్రంలో మునుపెన్నడూ లేని విధంగా పెను ప్రకంపనలు రేగుతున్నాయి. ఇరాన్ అహంకారాన్ని అణచివేసి, ఆ దేశ నౌకాదళాన్ని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా అమెరికా తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అమెరికా రక్షణ బలగాలు చేపట్టిన ఈ మెరుపు దాడులు ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. గత కొన్ని రోజులుగా నివురు గప్పిన నిప్పులా ఉన్న ఉద్రిక్తతలు ఇప్పుడు దావాగ్నిలా మారి సముద్ర జలాలను ఎర్రగా మార్చేస్తున్నాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ దాడులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ, ఇరాన్ ప్రాబల్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే వరకు విశ్రమించబోమని కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇరాన్ గర్వకారణంగా భావించే ఒక భారీ డ్రోన్ క్యారియర్‌ను అమెరికా క్షిపణులు లక్ష్యంగా చేసుకున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం నాటి భారీ విమాన వాహక నౌక పరిమాణంలో ఉండే ఈ యుద్ధ నౌక ప్రస్తుతం సముద్రం మధ్యలో అగ్నికీలల్లో చిక్కుకుంది. అత్యాధునిక సాంకేతికతతో, డ్రోన్ల తయారీ కేంద్రంగా ఉన్న ఈ నౌక ధ్వంసం కావడం ఇరాన్ నావికా రక్షణకు భారీ లోటుగా పరిణమించింది. ఆకాశం నుంచి నిప్పులు కురిపిస్తూ అమెరికా సేనలు చేసిన ఈ దాడితో శత్రువులకు కనీసం స్పందించే



అవకాశం కూడా లేకుండా పోయింది. ఈ పరిణామం ఇరాన్ సైనిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా ప్రపంచ దేశాలకు అమెరికా తన పవర్‌ను మరోసారి చాటిచెప్పినట్లయింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ సైన్యం వెంటనే ఆయుధాలను వీడాలని, లేదంటే పెను పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన అల్టిమేటం ఇచ్చారు. ఇరాన్‌ను నియంత్రించడానికి, ఆ దేశాన్ని దక్కించుకోవడానికి ఇదే సరైన సమయమని ట్రంప్ వ్యాఖ్యానించడం ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మాట వినకపోతే యుద్ధం ఆగదని, విధ్వంసం తప్పదని ఆయన చేసిన హెచ్చరికలు ఇరాన్ పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాజీ పడే ప్రసక్తే లేదని వైట్ హౌస్ నుంచి అందుతున్న సంకేతాలు యుద్ధం మరో ముదురు పాకాన పడబోతోందని సూచిస్తున్నాయి.

ఇరాన్ అంతర్గత నాయకత్వంపై కూడా ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ భవిష్యత్తు నాయకత్వ నిర్ణయంలో అమెరికా ప్రమేయం కచ్చితంగా ఉండాలని ఆయన పట్టుబట్టారు. కొత్త నాయకత్వం ఎవరనే విషయంలో తమ అభిప్రాయం తీసుకోవాలని సూచించడం ద్వారా ఇరాన్ గడ్డపై అమెరికా తన ఆధిపత్యాన్ని ఏ స్థాయిలో ప్రదర్శించాలనుకుంటుందో స్పష్టమవుతోంది. ఇది కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాదని, ఇరాన్ రాజకీయ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసే ఒక పెద్ద వ్యూహమని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ వ్యాఖ్యలు ఇరాన్ పాలకులకు నేరుగా సవాలు విసరడమే కాకుండా, అక్కడ విప్లవాత్మక మార్పులు సంభవించే అవకాశాలను పెంచుతున్నాయి.

సముద్ర మార్గాల్లో ఇరాన్ అనుసరిస్తున్న దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట వేయడమే ఈ దాడుల ప్రధాన ఉద్దేశమని యూఎస్ సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఇరాన్ నౌకాదళాన్ని మూలాల నుంచి పెకిలించి వేస్తామని, ఆ దేశ రక్షణ కవచాలను ఒక్కొక్కటిగా ఛేదిస్తామని స్పష్టం చేసింది. ఇప్పటికే సముద్ర గర్భంలో పలు ఇరాన్ నౌకలు అమెరికా దాడులకు నేలమట్టమయ్యాయి. తాజా దాడితో ఇరాన్ నౌకాదళం దాదాపుగా అచేతన స్థితిలోకి వెళ్లిపోయినట్లు సమాచారం అందుతోంది. ఈ ఆపరేషన్ కేవలం ప్రారంభం మాత్రమేనని, లక్ష్యం నెరవేరే వరకు దాడుల ఉధృతి కొనసాగుతూనే ఉంటుందని అమెరికా రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. అమెరికా చేపట్టిన ఈ మెరుపు దాడులతో పశ్చిమాసియాలోని ఇతర దేశాలు కూడా అప్రమత్తమయ్యాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్యే కాకుండా ప్రాంతీయ స్థిరత్వాన్ని ప్రభావితం చేసేలా ఉంది. ఒకవైపు ఇరాన్ తన పట్టు నిలుపుకోవడానికి ప్రయత్నిస్తుండగా, అమెరికా తన సాంకేతిక మరియు సైనిక శక్తితో ఇరాన్‌ను ఊపిరి ఆడనివ్వకుండా చేస్తోంది. డ్రోన్ క్యారియర్ నాశనం కావడం అనేది ఇరాన్ వ్యూహాత్మక సామర్థ్యానికి పెద్ద గండి అని చెప్పవచ్చు. ఈ పరిణామం ఇతర శత్రు దేశాలకు కూడా ఒక హెచ్చరికగా నిలుస్తుందని, అంతర్జాతీయ వాణిజ్య మార్గాలను సురక్షితం చేయడమే తమ ప్రాధాన్యత అని అమెరికా బలగాలు చెబుతున్నాయి. ఈ యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా చమురు రవాణాకు కీలకమైన ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అయితే అమెరికా మాత్రం ఇరాన్ విషయంలో ఇక ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పింది. ట్రంప్ తన రెండో విడత పాలనలో ఇరాన్ పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. దౌత్య మార్గాల కంటే సైనిక చర్యల ద్వారానే సమస్యను పరిష్కరించాలని ఆయన భావిస్తున్నారు. ఆయుధాలు వీడకపోతే భవిష్యత్తులో మరింత దారుణమైన దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ ప్రజలను మరియు సైన్యాన్ని ఆయన హెచ్చరిస్తున్నారు.

ఇరాన్ ప్రజల్లో కూడా ఈ దాడుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు సైనిక వైఫల్యాలు, మరోవైపు అంతర్జాతీయ ఆంక్షలతో ఆ దేశం కొట్టుమిట్టాడుతోంది. ఈ సమయంలో ట్రంప్ ఇచ్చిన 'నాయకత్వ మార్పు' ప్రతిపాదన ఇరాన్ లోపల కూడా అసమ్మతి సెగలను రగిలించే అవకాశం ఉంది. కొత్త నాయకత్వం తమకు అనుకూలంగా ఉండాలని అమెరికా కోరుకోవడంలో ఆంతర్యం ఆ ప్రాంతంలో శాశ్వత శాంతిని నెలకొల్పడమేనని కొందరు అంటుంటే, అది ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీయడమేనని మరికొందరు వాదిస్తున్నారు. ఏది ఏమైనా అమెరికా ప్రస్తుత దాడులు మాత్రం ఇరాన్ నౌకాదళాన్ని కోలుకోలేని స్థితికి నెట్టేశాయి.

ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ద్వారా అమెరికా తన సైనిక వ్యూహాల్లో ఎంతటి పదును ఉందో ప్రపంచానికి చూపించింది. అత్యాధునిక నిఘా వ్యవస్థలు, ఖచ్చితత్వంతో కూడిన క్షిపణి దాడులు ఇరాన్ రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయి. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ఇరాన్ గర్వంగా చెప్పుకునే యుద్ధ నౌకలను అమెరికా బూడిద చేసింది. ఈ దాడుల వెనుక ఉన్న పక్కా ప్రణాళికను చూస్తుంటే, అమెరికా చాలా కాలంగా దీని కోసం సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఇరాన్ నౌకాదళానికి సంబంధించి కీలక సమాచారాన్ని సేకరించిన అమెరికా, అత్యంత ప్రభావవంతమైన కేంద్రాలనే లక్ష్యంగా చేసుకుని దెబ్బకొట్టింది.

ప్రస్తుతానికి పశ్చిమాసియాలో పరిస్థితులు అత్యంత ఉత్కంఠభరితంగా ఉన్నాయి. అమెరికా తదుపరి అడుగు ఏమిటన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రంప్ హెచ్చరికలు, అమెరికా దళాల దాడులు చూస్తుంటే ఇరాన్‌లో భారీ మార్పులు సంభవించే రోజులు దగ్గర్లోనే ఉన్నట్లు అనిపిస్తోంది. సముద్రంలో మొదలైన ఈ మంటలు ఇరాన్ రాజకీయ ముఖచిత్రాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి. ఇరాన్ నాయకత్వం తన పంతాన్ని వీడి ఆయుధాలు వదిలిపెడుతుందా లేదా మరో యుద్ధానికి సిద్ధపడుతుందా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ ఉత్కంఠకు ముగింపు ఎక్కడ అన్నది కాలమే నిర్ణయించాలి.

## 'మాదిగ' జాతి రాజ్యం ఏలాలి

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులదేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నెలా వెయ్యి మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని, వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద నెలకు వెయ్యి కోట్లు చెల్లించాల్సి వస్తోందని వివరించారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ, సమన్వయంతో పాలనను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అవినీతిని అరికట్టి, అక్రమాలకు తావులేకుండా నిధులను ఖజానాకు చేర్చితేనే, ఆ డబ్బుతో పది మంది పేదలకు సహాయం చేసే వీలుంటుందని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూముల పంపిణీ విషయంలో ఉన్న క్లిష్ట పరిస్థితులను సీఎం నిష్కర్షగా వివరించారు. ఒకప్పుడు జాగీర్దార్లు, జమీందార్ల వద్ద వేలాది ఎకరాలు ఉండేవని, కానీ ప్రస్తుతం పంచడానికి ప్రభుత్వం దగ్గర భూములు లేవని స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకుంటుందని, పేదలకు చెందాల్సిన భూమి అన్యాక్రాంతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక వెసులుబాటు పరిమితంగా ఉన్న నేపథ్యంలో, ఉన్న వనరులనే సమర్థవంతంగా వాడుకుంటూ పేదల అభివృద్ధికి బాటలు వేయడమే ఏకైక మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మే రేవంత్ రెడ్డి, విద్యా శాఖ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి సారించారు. తన వద్దే ఉన్న విద్యా శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని, నాణ్యమైన విద్యను పేద బిడ్డలకు అందించడమే తన ధ్యేయమని చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థుల కోసం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. విద్య ఒక్కటే దళిత జాతుల జీవితాల్లో శాశ్వతమైన వెలుగును నింపుతుందని, హక్కులను చట్టబద్ధంగా కాపాడుకోవాలని ఆయన హితబోధ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ పోషించిన పాత్రను రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. రాష్ట్ర సాధన కోసం ఆమె చూపిన పట్టుదల, స్ఫూర్తితోనే తాను పని చేస్తానని ప్రకటించారు. అణగారిన వర్గాలకు న్యాయం



చేసే విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, తన శక్తి ఉన్నంత వరకు సామాజిక సమానత్వం కోసం పోరాడుతానని భరోసా ఇచ్చారు. రాజ్యాంగ బద్ధమైన హక్కుల రక్షణలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత బాధితులపై కూడా ఉందని సీఎం పేర్కొన్నారు. తనపై వస్తున్న రకరకాల పేర్ల గురించి రేవంత్ రెడ్డి ఎంతో హుందాగా స్పందించారు. వర్గీకరణ సమయంలో కొందరు 'రేవంత్ మాదిగ' అని, మరికొందరు 'రేవంత్ యాదవ్' అని, ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇస్తే 'రేవంత్ ముదిరాజ్' అని పిలిచారని గుర్తు చేశారు. ముస్లింలకు సహకరించినప్పుడు 'రేవంతుద్దీన్' అని కూడా అన్నారని, అయితే ఎవరు ఎలా పిలిచినా తనకు అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను అందరి వాడినని, కులమతాలకు అతీతంగా అందరికీ సేవ చేయడమే తన బాధ్యతని ఒక పరిణతి చెందిన నాయకుడిలా సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రి పదవిని తాను ఒక అధికార కేంద్రంగా కాకుండా, పది మందికి సహాయం చేసే అవకాశంగా భావిస్తున్నట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తనకు దక్కిన ఈ ఉన్నత స్థానం ద్వారా అణగారిన జాతులకు చేయూతనిచ్చినప్పుడే తనకు నిజమైన ఆనందం, తృప్తి కలుగుతాయని భావోద్వేగంగా చెప్పారు. తన హయాంలో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే అసలైన విజయమని, ఆ దిశగా అహర్నిశలు శ్రమిస్తానని సభ సాక్షిగా వాగ్దానం చేశారు. ఈ మార్పు కేవలం మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# ఇరాన్ ప్రతీకార జ్వాల!

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియా అగ్నిగుండంలా మారింది. శ్రీలంక తీరంలో తమ యుద్ధనౌక 'ఐఆర్ఐఎస్ దేనా'ను అమెరికా టార్పెడోలతో ముంచేయడం ఇరాన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇండియన్ నేవీ ఆహ్వానం మేరకు అతిథిగా వెళ్తున్న నౌకను ఎలాంటి హెచ్చరికలు లేకుండా కూల్చివేసి 87 మంది నావికులను బలితీసుకోవడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టించింది. దీనికి అమెరికా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ హెచ్చరించిన కొద్ది గంటల్లోనే యుద్ధం కొత్త మలుపు తిరిగింది. గురువారం తెల్లవారుజాము నుంచే ఇరాన్ తన అమ్ములపొదిలోని క్షిపణులను బయటకు తీసింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికన్ సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని వందలాది డ్రోన్లు, బాలిస్టిక్ మిసైళ్లతో విరుచుకుపడింది. టెల్ అవీవ్, జెరూసలెం నగరాల్లో సైరన్ల మోతతో ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ఇరాన్ ప్రతీకారం కేవలం మాటలకే పరిమితం కాలేదు. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తన యుద్ధ వ్యూహాన్ని పూర్తిగా మార్చేసింది. ఏకకాలంలో 9 అమెరికా సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. ఖతార్‌లోని అల్ ఉదైద్, బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం, ఇరాక్, కువైట్, జోర్డాన్‌లోని బేస్‌లపై డ్రోన్ల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో ఆరుగురు అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోగా, కువైట్‌లో నలుగురు పౌరులు మరణించారు. అటు ఇజ్రాయెల్ సైన్యం కూడా ధీటుగా స్పందిస్తోంది. లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఏకంగా 80 సార్లు దాడులు చేయడమే కాకుండా, ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. టెహ్రాన్ పరిసర ప్రాంతాల్లో వినిపిస్తున్న భారీ పేలుళ్ల శబ్దాలు అక్కడి భయానక పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

యుద్ధం ఇప్పుడు సముద్ర గర్భంలోనూ సెగలు పుట్టిస్తోంది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఒక్క చమురు చుక్క కూడా బయటకు వెళ్లనివ్వబోమని ఇరాన్ జనరల్ సర్దార్ జబ్బారీ చేసిన హెచ్చరికలు ప్రపంచ మార్కెట్‌ను వణికిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా, బ్రిటన్లకు చెందిన మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్



క్షిపణి దాడులు చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో పలావు జెండాతో వెళ్తున్న ట్యాంకర్‌పై జరిగిన దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోవడం మన దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సముద్ర మార్గాల్లో రవాణా అస్తవ్యస్తం కావడంతో ప్రపంచ దేశాల్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం కనిపిస్తోంది. యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ యుద్ధంలో సామాన్య ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు బలవుతుండటం అత్యంత విషాదకరం. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ నగరంలో ఒక పాఠశాలపై జరిగిన బాంబు దాడిలో 180 మంది విద్యార్థినులు, సిబ్బంది చనిపోవడం నాగరిక ప్రపంచాన్ని తలవంచుకునేలా చేస్తోంది. ఇరాన్ రెడ్ క్రెసెంట్ నివేదిక ప్రకారం, దేశంలోని 174 నగరాలపై దాడుల ప్రభావం పడింది. ఇప్పటి వరకు ఇరాన్‌లో మృతుల సంఖ్య 1,230కి చేరడం పరిస్థితి తీవ్రతను చెబుతోంది. ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు కూడా ధ్వంసం కావడంతో గాయపడిన వారికి చికిత్స అందడం గగనమైపోతోంది. లెబనాన్‌లోనూ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సరిహద్దుల వెంట శవపేటికల వరుసలు యుద్ధోన్మాదానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

యుద్ధం జరుగుతున్న వేళ అజర్ బైజాన్ వంటి పొరుగు దేశాలు కూడా ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమ విమానాశ్రయంపై డ్రోన్ దాడికి పాల్పడ్డారని అజర్ బైజాన్ ఆరోపిస్తుండగా, ఇరాన్ దానిని ఖండిస్తోంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఇరు దేశాల రాయబారులు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. అమెరికా గనుక భూతల దళాలను రంగంలోకి దించితే, వేల సంఖ్యలో శవపేటికలు పంపుతామని ఇరాన్ రాయబారి హెచ్చరించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ పరిస్థితుల్లో అగ్రరాజ్యం డొనాల్డ్ ట్రంప్ రక్తం చిందేలా చేయాలని ఇరాన్ మతగురువులు పిలుపునివ్వడం మంటల్లో ఆజ్యం పోసినట్లయింది. ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో చైనా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపేందుకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని ప్రకటించింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి దీని కోసం ప్రత్యేక దూతను పంపనున్నట్లు వెల్లడించారు. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలతో చర్చలు జరుపుతూ, పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఒమన్ ప్రభుత్వం కూడా యుద్ధాన్ని తక్షణమే ఆపాలని, విదేశీయులకు రక్షణ కల్పించాలని పిలుపునిచ్చింది. ఖతార్ ఎయిర్‌వేస్ వంటి సంస్థలు ప్రయాణికుల కోసం ప్రత్యేక రిలీఫ్ ఫ్లైట్స్ నడుపుతున్నప్పటికీ, గగనతలం మూసివేతతో జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ యుద్ధ మేఘాలు ఎప్పుడు తొలగుతాయోనని ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.


# సివిల్స్‌లో 'తెలంగాణ' జయకేతనం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశంలోనే అత్యున్నతమైన సర్వీసుగా భావించే సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాలు వెలువడటంతో తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కఠోర శ్రమ, మొక్కవోని దీక్షతో దేశ సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగిన అభ్యర్థులు తమ కలలను నిజం చేసుకున్నారు. ఈసారి ఫలితాల్లో తెలంగాణ బిడ్డలు అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఢిల్లీ పీఠంపై తమ ముద్ర వేశారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, ప్రభుత్వ ప్రోత్సాహంతో సివిల్స్ ర్యాంకులు సాధించిన అభ్యర్థుల గాథలు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు సివిల్స్ అంటే కేవలం సంపన్నులకే సాధ్యమనే అపోహను చెరిపివేస్తూ, సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారు సైతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎంపికవ్వడం గర్వకారణం. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' పథకం ఈ ఏడాది ఫలితాల్లో తన ప్రభావాన్ని స్పష్టంగా చూపింది. సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు సిద్ధమయ్యే పేద అభ్యర్థులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అందించిన రూ. లక్ష సాయం ఎందరికో కొండంత అండగా నిలిచింది. సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో అమలు చేసిన ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషం. కేవలం కోచింగ్ ఫీజులే కాకుండా, ఢిల్లీ వంటి నగరాల్లో ఉండి చదువుకోవడానికి అవసరమైన వసతి, పుస్తకాల ఖర్చుల కోసం ఈ నగదు ప్రోత్సాహం ఎంతో ఉపయోగపడిందని విజేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది మొత్తం 958 మంది అభ్యర్థులు తుది జాబితాలో చోటు దక్కించుకోగా, అందులో రిజర్వేషన్ల వారీగా కేటగిరీల విభజన జరిగింది. జనరల్ కేటగిరీ నుంచి 317 మంది, ఓబీసీ నుంచి 306, ఎస్సీ నుంచి 158, ఈడబ్ల్యూఎస్ నుంచి 104 . ఎస్టీ నుంచి 73 మంది ఎంపికయ్యారు. ఈ గణాంకాలు చూస్తుంటే సామాజికంగా అన్ని వర్గాల వారికి సివిల్ సర్వీసెస్‌లో ప్రాతినిధ్యం లభిస్తోందని అర్థమవుతోంది. తెలంగాణ నుంచి జశ్వంత్ చంద్ర 23వ ర్యాంకుతో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. అలాగే సృజన 55వ ర్యాంకుతో మహిళా అభ్యర్థుల్లో సత్తా చాటారు. వీరితో పాటు భానోత్ లక్ష్మీ రచన, ప్రచేత్ వంటి వారు కూడా టాప్ ర్యాంకుల్లో మెరిశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. రాజీవ్ సివిల్స్ అభయహస్తం కింద సాయం పొందిన 202 మంది అభ్యర్థుల్లో ఏకంగా 51 మంది ఇంటర్వ్యూ దశకు చేరుకోవడం ఒక రికార్డు. అందులోనూ 20 మంది తుది విజేతలుగా నిలవడం ఈ పథకం సక్సెస్ రేటును చాటి చెబుతోంది. విజేతలను అభినందించిన ముఖ్యమంత్రి, పేదరికంలో ఉన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అట్టడుగు వర్గాల నుంచి వచ్చే అభ్యర్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడే అసలైన సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు.




సాధారణంగా సివిల్స్ ప్రిపరేషన్ అంటే కొన్ని ఏళ్ల తపస్సుతో కూడుకున్న పని. ఎన్నో ఒడిదుడుకులు, మానసిక ఒత్తిడిని ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకోవడం అంత సులభం కాదు. జశ్వంత్ చంద్ర, సృజన వంటి టాపర్లు తమ ప్రిపరేషన్ కాలంలో ఎదుర్కొన్న సవాళ్లను దాటుకుని ఈ విజయాన్ని అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన అభ్యర్థుల్లో గ్రామీణ నేపథ్యం ఉన్నవారు ఎక్కువగా ఉండటం గమనార్హం. వీరిలో పల్లి ప్రమోద్ విష్ణు, గుమ్మల విజయసింహారెడ్డి, పొతుపురెడ్డి భార్గవ్ వంటి వారు తమ పట్టుదలను నిరూపించుకున్నారు. వీరి విజయం వెనుక వారి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు ప్రభుత్వ సహాయం కూడా కీలక పాత్ర పోషించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఈసారి మెరుగైన ఫలితాలు సాధించారు. ఇస్లావత్ శ్రీరామ్ హర్ష, గుగులోతు జితేందర్ నాయక్ వంటి వారు తమ కమ్యూనిటీల నుంచి ఎదిగి సివిల్స్ సాధించడం గర్వించదగ్గ విషయం. వీరి విజయాలు తండాల్లోని, పల్లెల్లోని వేలాది మంది యువతకు నూతన ఉత్తేజాన్ని ఇస్తున్నాయి. ఆన్‌లైన్ విద్య, డిజిటల్ రిసోర్సెస్ అందుబాటులోకి రావడంతో పాటు ప్రభుత్వ పరంగా అందుతున్న ఆర్థిక చేయూత వల్ల సామాన్యులు కూడా సివిల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మార్పు రాబోయే కాలంలో మరింత మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను మన రాష్ట్రం నుంచి తయారు చేసేందుకు దోహదపడుతుంది. యూపీఎస్సీ ప్రకటించిన వివరాల ప్రకారం, ఈ పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మార్కులను మరో 15 రోజుల్లో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. దీనివల్ల ర్యాంకు రాని అభ్యర్థులు ఎక్కడ వెనుకబడ్డారో విశ్లేషించుకోవడానికి అవకాశం ఉంటుంది. సివిల్స్ అనేది కేవలం ఒక పరీక్ష మాత్రమే కాదు, అదొక నిరంతర ప్రక్రియ. ఈసారి విజయం సాధించిన వారు తమ శిక్షణ అనంతరం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఆణిముత్యాలు రేపటి రోజున ఉత్తమ పాలకులుగా పేరు తెచ్చుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు. ముఖ్యంగా తెలుగు భాషను ఐచ్ఛికంగా తీసుకుని విజయం సాధించిన వారి సంఖ్య కూడా ఆశాజనకంగానే ఉంది.

ర్యాంకుల జాబితాను పరిశీలిస్తే.. ఎస్ వర్షిత్ రెడ్డి (259), ఎం. పవన్ కుమార్ రెడ్డి (297) వంటి యువకులు తమ ఇంజనీరింగ్ లేదా ఇతర ప్రొఫెషనల్ డిగ్రీల తర్వాత సివిల్స్‌ను కెరీర్‌గా ఎంచుకుని విజయం సాధించారు. వెలిమినేటి విక్రమసింహారెడ్డి (541), గుమ్మల శ్వేత (573) కూడా తమదైన శైలిలో రాణించారు. కట్టా ప్రత్యూష, గోగుల రాజశేఖర్ వంటి వారు తుది జాబితాలో నిలిచి తమ కలలను సాకారం చేసుకున్నారు. ఈ అభ్యర్థులందరూ వివిధ కేటగిరీల నుంచి వచ్చినప్పటికీ, వారి లక్ష్యం మాత్రం ప్రజలకు సేవ చేయడమేనని స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం తనవంతుగా విద్యార్థులకు ఇలాంటి మరిన్ని ప్రోత్సాహకాలను అందిస్తే భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించే అవకాశం ఉంది.

# ప్రగతి ప్రణాళిక అమలులో ముందంజలో నిలుపుదాం

- జిల్లా ఇంచార్జి మంత్రి ధనసురి అనసూయ సీతక్క
- 99 రోజుల ప్రణాళిక అమలుపై సన్నాహక సమావేశం
- అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి

**నిజామాబాద్, విశాలభారతి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలులో నిజామాబాద్, కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసురి అనసూయ సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలుపై నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉమ్మడి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేయగా, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్ లు ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక గురించి ఆయా శాఖలు, అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ, పల్లెలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఆయా శాఖల వారీగా పరిసరాల పరిశుభ్రత. ప్రభుత్వ



ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్.. అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం.. వ్యవసాయం, విద్య, యువత.. క్రీడలు, మహిళలు, పర్యావరణం అంశాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉద్యోగులు ప్రగతి ప్రణాళిక అమలులో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేస్తూ, ప్రజలకు జవాబుదారీగా పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ ప్రణాళిక అమలు ద్వారా రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రజారోగ్యం, విద్య, వైద్యం, అంగన్వాడీల నిర్వహణ, స్త్రీ శిశు సంక్షేమం, పారిశుధ్యం తదితర అంశాలలో స్పష్టమైన మార్పు కనిపించేలా అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలలో బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలను దూరం చేసేందుకు, డ్రగ్స్, కల్తీకల్లు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, వాటి నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఇంచార్జి మంత్రి ఆదేశించారు. అంగన్వాడి, గ్రామ పంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలపై గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆదర్శ పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడమే లక్ష్యంగా, అధికారులు సమన్వయంతో పని చేసి ఈ 'ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలని మంత్రి ధనసురి అనసూయ అధికారులను కార్యోన్ముఖులను చేశారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను వినియోగించాలని ఉమ్మడి జిల్లా అధికారులకు సూచించారు.

# దేశంలో పులి.. ట్రంప్ ముందు పిల్లి..!




**మొదటిపేజీ తరువాయి**

బంగాళాఖాతంలోకి పంపినా, ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గకుండా రష్యాతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుని దీటుగా సమాధానం ఇచ్చారు. ఆ రోజు ఉన్న ఆత్మగౌరవం నేడు ఎందుకు మృగ్యమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 56 అంగుళాల ఛాతీ అని చెప్పుకునే ప్రధాని మోడీ, ట్రంప్ విధిస్తున్న సుంకాలు, ఆంక్షల ముందు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది మిస్టరీగా మారింది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో పాల్గొని తిరిగి వెళ్తున్న ఇరాన్ నౌక 'ఐఆర్ఐఎస్ డేనా'పై అమెరికా దాడి చేసి ముంచేసింది. మన దేశ ఆహ్వానం మేరకు వచ్చిన అతిథి నౌకపై, మన తీరానికి కేవలం 350 కిలోమీటర్ల దూరంలో దాడి జరిగినా భారత్ కనీసం ఖండించకపోవడం దౌత్యపరమైన వైఫల్యంగా విమర్శకులు చూస్తున్నారు. వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయినా మౌనంగా ఉండటం మన బలహీనతను సూచిస్తోందని జాతీయవాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌తో మనకు చాబాహర్ పోర్ట్ వంటి కీలక ఒప్పందాలు ఉన్నప్పటికీ, అమెరికాకు భయపడి ఆ దేశానికి అండగా నిలవలేకపోతున్నామా అన్న చర్చ నడుస్తోంది. కాశ్మీర్ ఉద్రిక్తతల సమయంలో భారత్‌పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని డొనాల్డ్ ట్రంప్ వందల సార్లు ప్రకటించుకున్నారు. పాక్ నేతలు కూడా దీన్ని ధృవీకరించారు. కానీ భారత ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో ఎప్పుడూ స్పష్టమైన క్లారిటీ ఇవ్వలేదు. ట్రంప్ మన ఎగుమతులపై భారీగా సుంకాలు విధిస్తున్నా, మిత్రదేశాల నేతలను చంపేస్తున్నా భారత్ ప్రతిస్పందన శూన్యం. దేశంలో ప్రత్యర్థులపై విరుచుకుపడే మన నాయకులు, అంతర్జాతీయ వేదికలపై అమెరికా ముందు 'పిల్లి'లా మారుతున్నారని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. ఈ దైన్య స్థితి మన దేశ ప్రతిష్టను మసకబారుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్ అమెరికాకు ఇంతగా లొంగిపోవడానికి ప్రధాన కారణం గౌతమ్ అదానీపై నమోదైన కేసులేనని కాంగ్రెస్ వంటి ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సోలార్ కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూప్ రూ. 2000 కోట్ల లంచాలు ఇచ్చిందని, అమెరికా పెట్టుబడిదారులను మోసం చేసిందని న్యూయార్క్ ఫెడరల్ కోర్టులో కేసు నడుస్తోంది. అదానీ ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడు కావడం వల్ల, ఈ కేసుల నుంచి ఆయనను కాపాడటానికే అమెరికా చెప్పినట్టు భారత్ వింటోందన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. విదేశీ అవినీతి నిరోధక చట్టం ప్రకారం అమెరికాలో అదానీ చిక్కుకోవడం భారత ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్న 'ఎఫ్ స్టన్ ఫైల్స్' కూడా భారతీయ రాజకీయాల్లో వేడి పుట్టిస్తున్నాయి. ట్రంప్ తలుచుకుంటే ఆ ఫైల్స్‌లో ఉన్న భారతీయ ప్రముఖుల పేర్లు బయటపెడతారని, ఆ భయం వల్లే మోడీ ప్రభుత్వం అమెరికాకు దాసోహం అంటోందని రాహుల్ గాంధీ వంటి నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ ఆరోపణలకు బీజేపీ నుంచి సరైన సమాధానం రాకపోవడం గమనార్హం. ఒకవేళ ఇవే నిజమైతే, దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత రహస్యాల రక్షణకే ప్రాధాన్యత ఇస్తున్నారా అన్న అనుమానం కలగక మానదు. సామాన్య ప్రజలు కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. భారతదేశ చరిత్రలో అమెరికాకు ఇంతగా సాగిలపడిన సందర్భం గతంలో ఎప్పుడూ లేదని చరిత్రకారులు గుర్తు చేస్తున్నారు. మనం రష్యా నుంచి ఆయిల్ కొనాలా వద్దా అనేది మన అంతర్గత విషయం. కానీ అమెరికా అనుమతి ఇచ్చినందుకు సంతోషపడే స్థితికి రావడం మన సార్వభౌమాధికారానికి గొడ్డలిపెట్టు. విదేశీ వ్యవహారాల్లో స్వయం ప్రతిపత్తిని కోల్పోవడం వల్ల భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పకపోవచ్చు. అమెరికా తన ప్రయోజనాల కోసం భారత్‌ను ఒక సాధనంగా వాడుకుంటోందన్న విమర్శలు ఇప్పుడు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. మన విదేశాంగ విధానం మళ్ళీ గాడిలో పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేటి తరం యువత దేశ ఆత్మగౌరవాన్ని అత్యంత ప్రాముఖ్యంగా భావిస్తోంది. సోషల్ మీడియాలో 'ఆత్మనిర్భర్ భారత్' గురించి గొప్పగా చెప్పుకుంటున్న సమయంలో, ఆచరణలో ఇలాంటి లొంగుబాటు ధోరణులు కనిపించడం నిరాశ కలిగిస్తోంది. ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని చెబుతున్న మనం, ఒక దేశం అనుమతి కోసం ఎదురుచూడటం విడ్డూరంగా ఉంది. అగ్రరాజ్యాల మధ్య ఉన్న పోటీలో మనం పావులుగా మారకూడదని, సొంత నిర్ణయాలతో ముందుకు సాగాలని యువత కోరుకుంటోంది. కేవలం మాటల్లో కాకుండా చేతల్లో కూడా మన శక్తిని ప్రపంచానికి చూపించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతర్జాతీయ సంబంధాల్లో ఏ దేశం శాశ్వత మిత్రుడు కాదు, శాశ్వత శత్రువు కాదు. కానీ స్వయం గౌరవం మాత్రం శాశ్వతంగా ఉండాలి. అమెరికా ఇస్తున్న నెల రోజుల మినహాయింపు తాత్కాలిక ఉపశమనం కలిగించవచ్చు కానీ, అది మన దేశ సార్వభౌమాధికారంపై పడుతున్న మరకగా మిగిలిపోకూడదు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం మన హక్కు. దాన్ని ఎవరూ శాసించలేరు అన్న సంకేతాలను ప్రపంచానికి బలంగా పంపాలి. అదానీ కేసులు లేదా ఇతర రాజకీయ కారణాల వల్ల దేశ ప్రయోజనాలను పణంగా పెట్టడం భావ్యం కాదు. ఇప్పటికైనా మన నాయకత్వం మేల్కొని, భారత్ సత్తా ఏంటో చాటిచెప్పాలి.

# '99 రోజుల' ప్లాన్ ఒక పొలిటికల్ డ్రామా

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కొత్త 'డైవర్షన్ డ్రామా'కు తెరతీశారని ధ్వజమెత్తారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ప్రజలు సమర్పించిన లక్షలాది దరఖాస్తులు ఇప్పటికీ అతీగతీ లేకుండా చెత్తబుట్టల్లో మగ్గుతున్నాయని, వాటిని పరిష్కరించలేని ప్రభుత్వం మళ్లీ పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేయాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న ఈ 99 రోజుల ప్రచార పర్వం కేవలం ఉత్తి దండగ వ్యవహారమని హరీశ్ రావు కొట్టిపారేశారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనలో జరుగుతున్న అవినీతి స్కామ్‌లు, నిత్యం పెరుగుతున్న ప్రజల వ్యతిరేకత నుంచి తప్పించుకోవడానికే రేవంత్ సర్కారు ఈ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను నమ్ముకుందని విమర్శించారు. గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి ప్రభుత్వం సాధించిన వైఫల్యాలను ప్రచారం చేసుకుంటారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం మాత్రం కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని కేవలం పబ్లిసిటీ కోసం తగలేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



రైతాంగం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందని హరీశ్ రావు విమర్శించారు. పంటల కోతల సమయం వచ్చినా ఇప్పటి వరకు రైతు భరోసా ఊసే లేదని, గత సీజన్ పంట బోనస్ ఇవ్వకుండా రైతులను నమ్మించి గొంతు కోశారని ఆరోపించారు. కనీసం యూరియా కూడా సకాలంలో సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డుపై నిలబెట్టిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. ఇప్పుడు గ్రామాలకు వెళ్లే కాంగ్రెస్ నేతలు రైతులకు ఏమని సమాధానం చెబుతారని నిలదీశారు. వ్యవసాయ రంగం కుదేలవుతుంటే, ప్రభుత్వం మాత్రం ప్రకటనలతో కాలక్షేపం చేస్తోందని మండిపడ్డారు.

నిరుద్యోగుల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్ద మోసానికి పాల్పడిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక యువతను నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూసిన జాబ్ క్యాలెండర్ కాస్తా 'జాబ్ లెస్ క్యాలెండర్'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. కొత్త నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో వేల కోట్లు లూటీ చేసేందుకు పథకాలు రచిస్తున్నారని ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం కింద సేకరించిన దరఖాస్తులను పట్టించుకోకుండా, ఇప్పుడు మళ్లీ నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పల్లవి అందుకోవడం నిరుద్యోగులను వెక్కిరించడమేనన్నారు.

వైద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మందులు లేని పరిస్థితి ఉందని, పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని, కనీస బాధ్యతలను నిర్వహించాల్సిన ప్రభుత్వం.. పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వంటి పనులకు కూడా ఒక ఈవెంట్ లాగా కలర్ ఇచ్చి ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మంత్రులు కేవలం కొద్దిమంది లబ్ధిదారులను చూపిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది బాధితుల గోస ప్రభుత్వానికి వినిపించడం లేదని అన్నారు. పర్యావరణం, సోలార్ విద్యుత్, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే వాడుకుంటున్నారని హరీశ్ రావు విమర్శించారు. ఈ విషయాల్లో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. పాలన గాలికి వదిలేసి, ప్రచారాల మీద పెట్టిన శ్రద్ధ ప్రజల సమస్యల మీద పెట్టాలని హితవు పలికారు. ఇప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తవుతున్నా, ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఎన్ని గారడీలు చేసినా ప్రజలు గమనిస్తున్నారని హరీశ్ రావు హెచ్చరించారు. సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి 'ప్రజా పాలన' పేరుతో కొనసాగిస్తున్న ఈ దుర్మార్గపు పాలనను నిలదీసేందుకు తెలంగాణ సమాజం సిద్ధంగా ఉందన్నారు. గ్రామ గ్రామాన ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ డ్రామాలను ఎండగడుతూనే ఉంటామని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఇప్పుడైనా ప్రచార ఆర్భాటాలు పక్కన పెట్టి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను తీర్చాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజా పాలన పేరుతో మళ్లీ దరఖాస్తులు సేకరించి ప్రజలను వంచించడం ఆపాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేస్తూ, కేవలం అప్పులతో కాలం వెళ్లదీస్తూ, అభివృద్ధిని కుంటుపరిచిన రేవంత్ రెడ్డి సర్కారు.. ఇప్పుడు 99 రోజుల ప్లాన్ పేరుతో ముందుకు రావడం కేవలం ఎన్నికల స్టంట్లు తప్ప మరేమీ కాదని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి శూన్యమని, కేవలం కాగితాల మీద, హోర్డింగ్‌ల మీద మాత్రమే కాంగ్రెస్ పాలన కనిపిస్తోందని విమర్శించారు. ప్రజల కష్టార్జితాన్ని ప్రచారాలకు వాడటం ఆపి, ప్రజా సంక్షేమానికి వెచ్చించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గ్లోబల్ మార్కెట్‌లో 'మన' పంట

**మొదటిపేజీ తరువాయి**

ప్రతి గింజ ప్రపంచ మార్కెట్‌లో పోటీపడేలా ఉండాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతులు ఒకే తాటిపైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. మన దేశంలో ఉన్న విభిన్న వాతావరణ పరిస్థితులు రైతులకు ఒక వరం లాంటివని, వాటిని సరిగ్గా వినియోగించుకుంటే భారత్ ప్రపంచ ఆహార భాండాగారంగా మారుతుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో కేవలం దిగుబడి పెంచడం మాత్రమే సరిపోదని, నాణ్యత, బ్రాండింగ్‌పై దృష్టి సారించాలని ప్రధాని సూచించారు. 'మేడ్ ఇన్ ఇండియా' వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నప్పుడే మన రైతులకు సరైన గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా ఎగుమతుల రంగాన్ని బలోపేతం చేయవచ్చని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోరారు. వ్యవసాయం అనేది కేవలం పొలం పనులకు పరిమితం కాకుండా, ఒక లాభసాటి వ్యాపార నమూనాగా ఎదగాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన మాటల్లో వ్యక్తమైంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు వ్యవసాయ రంగంలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయని ప్రధాని వివరించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా దాదాపు 10 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి నేరుగా 4 లక్షల కోట్ల రూపాయలు చేరడం ఒక మైలురాయిగా ఆయన అభివర్ణించారు. దీనికి తోడు కనీస మద్దతు ధర సంస్కరణల వల్ల రైతులకు పెట్టుబడిపై ఒకటిన్నర రెట్ల ఆదాయం లభిస్తోందని గుర్తుచేశారు. గతంలో రైతులకు రుణ సదుపాయం అందడం గగనంగా ఉండేదని, కానీ నేడు సంస్థాగత క్రెడిట్ కవరేజీ 75 శాతానికి పెరిగిందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా రైతులు 2 లక్షల కోట్ల మేర బీమా చెల్లింపులు అందుకోవడం వారి ఆర్థిక భద్రతకు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు.



రాబోయే కాలంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు 202627 బడ్జెట్‌లో 'హైవ్యాల్యూ' ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మోదీ వెల్లడించారు. జీడిపప్పు, కోకో, శ్రీగంధం వంటి పంటలు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ కలిగి ఉన్నాయని, వీటి సాగును ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వంట నూనెలు, పప్పు ధాన్యాల దిగుమతులను తగ్గించుకోవడానికి 'జాతీయ మిషన్'లను ఏర్పాటు చేశామని, ఇవి స్వయం సమృద్ధికి దోహదపడతాయని తెలిపారు. అధిక విలువ కలిగిన ఉత్పత్తులను పెంచినప్పుడే మన దేశ వ్యవసాయం ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధమవుతుందని ఆయన స్పష్టం చేశారు. నేటి యువత వ్యవసాయ రంగంలో ఉన్న స్టార్టప్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు.

ప్రస్తుత ప్రపంచం ఆరోగ్యం పట్ల మునుపెన్నడూ లేనంత స్పృహతో ఉందని, అందుకే సేంద్రీయ ఆహారానికి ఆదరణ పెరుగుతోందని ప్రధాని గుర్తుచేశారు. రసాయన రహిత సాగు లేదా ప్రకృతి వ్యవసాయం అనేది భవిష్యత్తులో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ తలుపులు తెరిచే 'రహదారి' వంటిదని ఆయన అభివర్ణించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూనే, నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా భారత్ గ్లోబల్ వెల్‌నెస్ మార్కెట్‌లో అగ్రగామిగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సాంకేతిక సాయం మరియు శిక్షణ అందించడానికి సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ప్రకృతితో మమేకమై చేసే సాగు వల్ల ఖర్చులు తగ్గి, దీర్ఘకాలంలో లాభాలు పెరుగుతాయని ఆయన వివరించారు.

పాడి పరిశ్రమ గురించి మాట్లాడుతూ, పశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మోదీ వివరించారు. జంతువులకు సోకే గాలికుంట వ్యాధిని అరికట్టేందుకు ఇప్పటివరకు 125 కోట్ల కంటే ఎక్కువ డోసుల టీకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశువుల ఉత్పాదకతను పెంచేందుకు సరికొత్త సాంకేతికతను జోడిస్తున్నామని చెప్పారు. కేవలం సాగుపైనే కాకుండా, అనుబంధ రంగాలపై కూడా రైతులు దృష్టిసారించినప్పుడే స్థిరమైన ఆదాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పాడి రైతులను కూడా కిసాన్ క్రెడిట్ కార్డుల పరిధిలోకి తీసుకురావడం ద్వారా వారికి అవసరమైన పెట్టుబడి సాయం సులభంగా అందుతోందని ఆయన వెల్లడించారు.

పశుసంవర్ధక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి ద్వారా ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'గోవర్ధన్ యోజన' గురించి ప్రస్తావిస్తూ, పశువుల వ్యర్థాల నుంచి కూడా ఆదాయాన్ని సృష్టించవచ్చని ఆయన ఉదాహరించారు. గ్రామాలు శుభ్రంగా ఉండటమే కాకుండా, పేడ ద్వారా బయోగ్యాస్, సేంద్రీయ ఎరువులను తయారు చేయడం ద్వారా రైతులకు అదనపు సంపాదన లభిస్తుందని చెప్పారు. ఈ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత అంశంగా తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు. ఇది 'చెత్త నుంచి సంపద' సృష్టించే గొప్ప ప్రక్రియ అని ఆయన కొనియాడారు. పంటల వైవిధ్యీకరణ ప్రాముఖ్యతను ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. కేవలం ఒకే రకమైన పంటపై ఆధారపడటం వల్ల మార్కెట్ ఒడిదుడుకులు ఎదురైనప్పుడు రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని గత అనుభవాలు చెబుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఆదాయ మార్గాలను పెంచుకోవాలంటే మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రకరకాల పంటలు పండించాలని సూచించారు. వాతావరణ మార్పులను తట్టుకోగలిగే రకాలను సాగు చేయడం ద్వారా నష్ట భయం తగ్గుతుందని ప్రధాని తెలిపారు. రైతులు తమ సంప్రదాయ జ్ఞానానికి ఆధునిక విజ్ఞానాన్ని జోడించి సాగులో కొత్త ప్రయోగాలు చేయాలని ఆయన ప్రోత్సహించారు. వ్యవసాయం అనేది ప్రాథమికంగా రాష్ట్రాల పరిధిలోని అంశమని, అందుకే రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకమని ప్రధాని గుర్తుచేశారు. రాష్ట్రాల వద్ద భారీ వ్యవసాయ బడ్జెట్లు ఉన్నాయని, వాటిని చాలా తెలివిగా, పారదర్శకంగా వినియోగించాలని ఆయన సూచించారు. గ్రామాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కేటాయించే ప్రతి పైసా క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేంద్రం ఇచ్చే సూచనలను, పథకాలను రాష్ట్రాలు సద్వినియోగం చేసుకుంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల శ్రేయస్సు కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు.

# ట్రంప్ నెక్స్ట్ టార్గెట్ 'క్యూబా'

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్ పని పూర్తవ్వడమే తరువాయి, తదుపరి లక్ష్యం క్యూబానే అనే సంకేతాలను ఆయన చాలా బలంగా ప్రపంచానికి పంపారు. ప్రస్తుతం క్యూబాపై అమెరికా విధిస్తున్న కఠిన ఆంక్షలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. "మనం ఇప్పుడు ఇరాన్ పనిని త్వరగా ముగించాలనుకుంటున్నాం.. అది పూర్తయ్యాక క్యూబా వంతు వస్తుంది, అది కేవలం సమయం పట్టే విషయం మాత్రమే" అని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. ఇప్పటికే వెనిజులా అధ్యక్షుడిని బంధించడం, లాటిన్ అమెరికాలో అగ్రరాజ్యం తన సైనిక పటిమను ప్రదర్శించడం ద్వారా ట్రంప్ తన ఉద్దేశాలను ఇదివరకే స్పష్టం చేశారు. ఇప్పుడు నేరుగా క్యూబా ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడం ద్వారా ఆ ప్రాంతంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

క్యూబా, అమెరికా మధ్య వైరం దశాబ్దాల చరిత్ర కలిగిన ఒక చేదు జ్ఞాపకం. 1959లో ఫిడెల్ కాస్ట్రో నేతృత్వంలో క్యూబాలో కమ్యూనిస్ట్ విప్లవం విజయవంతమైనప్పటి నుండి, అమెరికా ఆ దేశాన్ని తన భద్రతకు ముప్పుగా భావిస్తూ వస్తోంది. అమెరికా ప్రధాన భూభాగానికి కేవలం 90 మైళ్ల దూరంలోనే ఒక కమ్యూనిస్ట్ దేశం ఉండటం, అది అప్పటి సోవియట్ యూనియన్‌కు మద్దతుగా నిలవడాన్ని వాషింగ్టన్ ఏనాడూ జీర్ణించుకోలేకపోయింది. 1962 నాటి క్యూబన్ మిస్సైల్ క్రైసిస్ ప్రపంచాన్ని అణు యుద్ధం అంచున నిలబెట్టిన ఉదంతం ఇప్పటికీ అంతర్జాతీయ సంబంధాల్లో ఒక ప్రధాన చర్చనీయాంశంగా మిగిలిపోయింది.




క్యూబాను ఆర్థికంగా దెబ్బతీయడమే పరమావధిగా అమెరికా దశాబ్దాలుగా వాణిజ్య దిగ్బంధాన్ని కొనసాగిస్తోంది. ట్రంప్ తన రెండో విడత పాలనలో ఈ ఆంక్షలను ఊహించని రీతిలో కఠినతరం చేశారు. ముఖ్యంగా వెనిజులా నుండి క్యూబాకు వచ్చే చమురు సరఫరాను అడ్డుకోవడం ద్వారా ఆ దేశ ఆర్థిక వెన్నెముకను విరిచే ప్రయత్నం చేస్తున్నారు. దీని ప్రభావంతో క్యూబాలో ప్రస్తుతం పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. నిత్యం విద్యుత్ కోతలు, ఇంధన కొరతతో పాటు ఆహార సంక్షోభం ప్రజలను రోడ్లపైకి వచ్చేలా చేస్తోంది. ఆర్థికంగా చితికిపోవడమే కాకుండా, విదేశీ పెట్టుబడులు లేక ఆ దేశం అల్లాడుతోంది.

ప్రాంతీయ రాజకీయాలను పరిశీలిస్తే, ఇరాన్, క్యూబా రెండు దేశాలు కూడా దశాబ్దాలుగా అమెరికా వ్యతిరేక కూటమిలో కీలకంగా ఉన్నాయి. ఇరాన్‌పై 'మిడ్‌నైట్ హామర్' వంటి మెరుపు సైనిక చర్యల ద్వారా విజయం సాధిస్తున్నామని నమ్ముతున్న ట్రంప్, అదే దూకుడును లాటిన్ అమెరికాలోనూ ప్రదర్శించాలని భావిస్తున్నారు. క్యూబాలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని కూల్చివేసి, అక్కడ తమకు అనుకూలమైన ప్రజాస్వామ్య వ్యవస్థను తీసుకురావడమే ట్రంప్, మార్కో రూబియోల ప్రధాన ఎజెండా అని స్పష్టమవుతోంది. ఇది కేవలం ఒక దేశంపై ఆధిపత్యం మాత్రమే కాదు, ఆ ప్రాంతంలో చైనా, రష్యా ప్రభావాన్ని తగ్గించే ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే ట్రంప్ అనుసరిస్తున్న ఈ కఠిన వైఖరి అంతర్జాతీయ సమాజంలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. క్యూబాపై విధిస్తున్న ఆంక్షల వల్ల అక్కడ సామాన్య ప్రజలు మానవీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. అమెరికా చేస్తున్న ఈ ప్రయత్నాన్ని క్యూబా ప్రభుత్వం ఒక 'సామూహిక శిక్ష'గా అభివర్ణిస్తోంది. అంతర్జాతీయ చట్టాలను, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని లెక్కచేయకుండా సైనిక శక్తితో ప్రభుత్వాలను మార్చాలని చూడటం ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కానీ, ట్రంప్ తన పంతం నెగ్గించుకోవడంలో వెనక్కి తగ్గే సూచనలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం క్యూబా ఒక క్లిష్ట పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అగ్రరాజ్యం తనపై ఎప్పుడు సైనిక చర్యకు దిగుతుందో అన్న భయం ఆ ద్వీప దేశాన్ని వెంటాడుతోంది. ఇటు చమురు సరఫరా ఆగిపోవడం, అటు అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నుండి దూరం కావడం వల్ల క్యూబా తన చరిత్రలోనే అత్యంత గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. మార్కో రూబియో వంటి క్యూబన్ అమెరికన్ నేతలకు ఆ దేశంపై ఉన్న వ్యతిరేకతను ట్రంప్ తన రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారు. క్యూబాలో విప్లవ ముగింపు పలకడమే లక్ష్యంగా వైట్ హౌస్ పావులు కదుపుతోంది. మరోవైపు, అమెరికాలో ఉన్న క్యూబన్ ఎగ్జైల్స్ ట్రంప్ నిర్ణయాలను స్వాగతిస్తున్నారు. కమ్యూనిస్ట్ పాలన నుండి క్యూబాకు విముక్తి లభించే సమయం ఆసన్నమైందని వారు భావిస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో ఉన్న క్యూబన్ ప్రజలకు మాత్రం ఇది ఒక అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సైనిక జోక్యం జరిగితే అది మరో సుదీర్ఘ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ తరహాలోనే క్యూబాను కూడా ఒక వార్ జోన్‌గా మార్చడం వల్ల అమెరికాకు కలిగే లాభం కంటే నష్టమే ఎక్కువ ఉండవచ్చని విశ్లేషణలు సాగుతున్నాయి. ట్రంప్ తన విదేశీ విధానంలో 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో పాటు 'శత్రు నిర్మూలన'ను కూడా ఒక భాగంగా మార్చుకున్నారు. ఇరాన్ పని ముగిసిన తర్వాత తదుపరి అడుగు క్యూబాలో పడటం ఖాయమని ఆయన చేసిన వ్యాఖ్యలు లాటిన్ అమెరికా దేశాల్లో కలకలం రేపుతున్నాయి. మెక్సికో నుండి వెనిజులా వరకు ఉన్న అమెరికా వ్యతిరేక శక్తులన్నీ ఇప్పుడు ఏకం కావాల్సిన సమయం వచ్చిందని కమ్యూనిస్ట్ పక్షాలు పిలుపునిస్తున్నాయి.

## ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ దాడులను ఖండించిన సిపిఎం

- సత్తుపల్లిలో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహణ
- సిపిఎం ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ
- యుద్ధ చర్యలను నిలిపి శాంతి చర్చలు చేపట్టాలని డిమాండ్
- ఐక్యరాజ్యసమితి తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

**సత్తుపల్లి, విశాలభారతి :** ఇరాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయిల్ చేపడుతున్న దాడులను ఖండిస్తూ సిపిఎం నాయకులు సత్తుపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం సత్తుపల్లి పట్టణ, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాసులు మాట్లాడుతూ, ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దురాక్రమణ దాడులు తీవ్రంగా ఖండనీయమన్నారు. అమెరికా సామ్రాజ్యవాద ధోరణితో వివిధ దేశాలపై దాడులు కొనసాగించడం తప్పుడు చర్య అని పేర్కొన్నారు. ఇప్పటికే ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేసి వేలాది మందిని హతమార్చిందని తెలిపారు.ఇప్పుడు ఆయిల్ ఆధిపత్యం కోసం ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందనే నెపంతో అమెరికా-ఇజ్రాయిల్ కలిసి దాడులు జరపడం ఆందోళనకరమని అన్నారు. ఈ దాడుల్లో ఉన్నతాధికారులు, వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, పాఠశాలలపై దాడులు చేసి విద్యార్థులను హతమార్చడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. వెంటనే యుద్ధ చర్యలను నిలిపివేసి శాంతి చర్చలు ప్రారంభించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకుని యుద్ధాన్ని నివారించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలి సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, బాల బుచ్చయ్య, బండి వేలాద్రి, మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, బండి రఘుపతి రెడ్డి, మల్లికార్జున్, వెంకటేశ్వరరావు, గుదే రాము, జిలాని, నబి, రాంబాబు, రత్నకుమారి, పుష్పవల్లి, బసవమ్మ, బెజవాడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులు కల్పించాలని సర్పంచ్‌కు వినతి



**బయ్యారం, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామపంచాయతీ సర్పంచ్ శాంతి కిషన్ నాయక్‌ను కలిసి గంగభజార్ ప్రాంతానికి చెందిన దినసరి కూలీలు ఉపాధి హామీ పనులు కల్పించాలని వినతి చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో తాము ప్రతిరోజూ దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వారు తెలిపారు. కూలీలు మాట్లాడుతూ, గ్రామంలో పనులు లేకపోవడంతో ఉదయం నాలుగు గంటలకే లేచి సుమారు నలభై నుండి యాభై కిలో మీటర్ల దూరంలోని ప్రాంతాలకు వలస వెళ్లి వ్యవసాయ పనులు చేస్తున్నామని తెలిపారు. మిరప, పత్తి, ఇతర పంటల కోత పనులకు వెళ్లినా చీడపీడల కారణంగా పంటలు దెబ్బతినడంతో అక్కడ కూడా పనులు సరిగా దొరకడం లేదని వారు వాపోయారు. అందువల్ల గ్రామంలోనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని సర్పంచ్‌ను కోరారు. ఈ విషయంపై స్పందించిన సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ వెంటనే సంబంధిత అధికారిని చరవాణి ద్వారా సంప్రదించి ఉపాధి హామీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యను వెంటనే గమనించి స్పందించిన సర్పంచ్‌కు కూలీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగభజార్ కాలనీకి చెందిన రేష్మ, రచ్చ పద్మ, గొడుగు కలమ్మ, కట్ల రాంబాయి, కంబాల పద్మ, గుండాల కవిత తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంపై రైతులకు శిక్షణా తరగతులు ప్రారంభం



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అమ్మపాలెం రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించే శిక్షణా తరగతులను ఆత్మ మరిపెడ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయంలో కొత్త పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలంటే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మరియు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సిద్ధమైన పదార్థాలతో సాగు చేయడం రైతులకు మేలని వివరించారు. ఆవు పేడ, ఆవు మూత్రం, వానపాముల ఎరువు, వేపకాయలు, చెరువు మట్టి వంటి ప్రకృతిలో లభించే పదార్థాలను ఉపయోగించి పంటలను సాగు చేస్తే భూమి సారవంతం పెరిగి మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. రసాయనిక ఎరువుల అధిక వాడకం వల్ల భూమిలో పోషక విలువలు తగ్గిపోతాయని, దీర్ఘకాలంలో రైతులకు నష్టాలు కలుగుతాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడి రైతులకు అధిక లాభాలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. అందుకే రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై ఆసక్తిగా తెలుసుకున్నారు. వ్యవసాయ నిపుణులు రైతులకు పంటల సంరక్షణ, ప్రకృతి ఆధారిత ఎరువుల తయారీ, భూమి సారాన్ని పెంచే విధానాలపై వివరించారు. రైతులు ఈ పద్ధతులను తమ పొలాల్లో అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలని నిపుణులు సూచించారు.

## స్పెషలిస్ట్ వైద్య శిబిరం ప్రారంభం



**మహబూబాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం మార్చి 6 నుండి మార్చి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక నిపుణుల వైద్య సేవల శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కూడా నిపుణుల వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, వైద్యాధికారి డాక్టర్ కవిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మరియు దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భట్టు నాయక్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ఎమ్మార్వో, ఎంపీడీవోతో పాటు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, యువజన నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజలకు నిపుణుల వైద్య సేవలు అందించడంలో ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు.

## విద్యార్థులకు ఎగ్జామినేషన్ మెటీరియల్ పంపిణీ



**విశాలభారతి, అడవిదేవులపల్లి:** లయన్స్ క్లబ్స్ ఆఫ్ మిర్యాలగూడ అధ్యక్షులు బి ఎం నాయుడు, ఏం సత్యనారాయణరెడ్డి, మరియు లయన్స్ క్లబ్స్ ఆఫ్ మిర్యాలగూడ భాస్కర చార్టెడ్ ప్రెసిడెంట్ ఏచూరి మురహరి మరియు భాగ్యలక్ష్మి మరియు అడవిదేవులపల్లి గ్రామ సర్పంచ్ కూరాకుల చినరామయ్య బాల తాళ్ల వీరప్ప గూడెం మాజీ సర్పంచ్ బాల శ్రీనివాస్ నాయుడు సుజాత మాజీ ఎంపీపీ మంగమ్మ , ఎస్సై శేఖర్ మరియు పసుపులేటి చెన్నకేశవులు వారి సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందము విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. వీరి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆడవదేవులపల్లి విద్యార్థులకు 75 మందికి ఎగ్జామినేషన్ మెటీరియల్ పంపిణీ చేయనైనది. ఇదే విధముగా కస్తూరిబా పాఠశాలలో 57 మంది విద్యార్థులకు ఎగ్జామినేషన్ మెటీరియల్స్ ఇవ్వనైనది.పరీక్ష రాసే విధానంలో విద్యార్థులకు సరైన సూచనలు ఇస్తూ భవిష్యత్తులో మంచిగా రాణించాలని కోరుకుంటూ అందరికీ శుభాశీస్సులు ఆల్ ది బెస్ట్ చెప్పనైనది.. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**






**మహబూబాబాద్, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, శాసన సభ్యులు మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. విద్యా మరియు వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తొలగించి అవసరమైన సిబ్బందిని నియమించాలని, మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని వినియోగంలోకి తేవాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోరుట్ల బరిలో మాజీ మావోయిస్ట్ దేవ్ జీ?

**మొదటిపేజీ తరువాయి**





రావాలని నిర్ణయించుకోవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గం వేదికగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కీలక పరిణామాన్ని రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు బయటపెట్టారు. సాధారణంగా గోనె ప్రకాశ్‌రావు ఏ విషయం చెప్పినా అందులో ఖచ్చితత్వం ఉంటుందని రాజకీయ వర్గాల్లో ఒక నమ్మకం ఉంది. అనవసర ప్రచారాలకు దూరంగా ఉంటూ, పక్కా సమాచారంతోనే ఆయన మీడియా ముందుకు వస్తుంటారు. ఇప్పుడు దేవ్ జీ రాజకీయ ప్రవేశం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు కోరుట్ల రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపుతున్నాయి. మావోయిస్టు సిద్ధాంతాల నుంచి ప్రజాస్వామ్య పంథాలోకి వచ్చిన దేవ్ జీకి క్షేత్రస్థాయిలో ఉన్న పట్టు ఇక్కడ కలిసి వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు, మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత ముప్పాళ లక్ష్మణరావు అలియాస్ గణపతిని కూడా ప్రజాజీవనంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. గణపతి ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఈ తరుణంలో ఆయన పోలీసులకు లొంగిపోయి ప్రశాంతమైన జీవనం గడపాలని గోనె ప్రకాశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా ఆయన ప్రాణాలకు భరోసా ఇస్తుందని, వైద్య సాయం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అడవిలో ఉంటూ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడం కంటే, ప్రజల మధ్యకు వచ్చి తన అనుభవంతో సమాజానికి మేలు చేయాలని కోరారు.

ఈ క్రమంలో గణపతి కుమారుడు ముప్పాళ వాసుదేవరావు చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తన తండ్రి తుపాకీని వదిలేసి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన ఆకాంక్షించారు. గతంలో తాను పంపిన వాయిస్ మెసేజ్ మీడియాలో వైరల్ అవ్వడంపై ఆయన క్షమాపణలు కోరుతూనే, తండ్రి ప్రజాసేవలోకి రావాలనే తన కోరికను బలంగా వినిపించారు. గణపతి గనుక బయటకు వస్తే ఆయనతో కలిసి పనిచేయడానికి తాను సిద్ధమని గోనె ప్రకాశ్‌రావు ప్రతిపాదించడం గమనార్హం. ఇది మావోయిస్టు కేడర్‌లో ఎలాంటి చలనం కలిగిస్తుందో చూడాలి. పోలీసు యంత్రాంగం కూడా గతంలోలా కాకుండా మావోయిస్టు నేతలను సమాజంలో గౌరవప్రదంగా బతికేలా ప్రోత్సహిస్తోందని గోనె అభిప్రాయపడ్డారు. దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి వంటి కీలక నేతలను ఎన్‌కౌంటర్ చేసే అవకాశం ఉన్నా, వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి సమాజంలో కలిపేలా పోలీసులు వ్యవహరించారని గుర్తుచేశారు. ఈ మార్పు వల్ల అడవిలో ఉన్న మరికొందరు నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చే అవకాశం ఏర్పడిందని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వాల ఆలోచనా ధోరణిలో వచ్చిన మార్పు మాజీ నక్సలైట్లలో భరోసా నింపుతోంది. ప్రస్తుత తెలంగాణ రాజకీయాల్లో మాజీ మావోయిస్టుగా ప్రస్థానం మొదలుపెట్టి అత్యున్నత స్థాయికి ఎదిగిన సీతక్క ఉదాహరణను గోనె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒకప్పుడు సాయుధ పోరాటంలో ఉన్న సీతక్క, ఆ తర్వాత లొంగిపోయి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో గెలిచి నేడు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె సాధించిన విజయం ఎంతో మంది మాజీ నక్సలైట్లకు స్ఫూర్తినిస్తోందని, దేవ్ జీ కూడా అదే బాటలో పయనించి కోరుట్ల ప్రజలకు సేవ చేయాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. చట్టసభల ద్వారానే ప్రజల సమస్యలను పరిష్కరించడం సులువని వారు గుర్తిస్తున్నారు. కోరుట్ల నియోజకవర్గంలో దేవ్ జీ పోటీ చేస్తే అక్కడి రాజకీయ చిత్రం పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మావోయిస్టు ఉద్యమ ప్రభావం ఎక్కువే కావడంతో, ఆయన పట్ల సానుభూతి ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఏ పార్టీ తరపున పోటీ చేస్తారు లేదా స్వతంత్రంగా బరిలోకి దిగుతారా అన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గోనె ప్రకాశ్‌రావుకు అన్ని పార్టీల నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో, ఆయన ద్వారా దేవ్ జీ ఏదైనా ప్రధాన పార్టీతో చర్చలు జరుపుతున్నారా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

గణపతి ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయన లొంగిపోవడమే ఉత్తమమని కుటుంబ సభ్యులు కూడా భావిస్తున్నారు. సుదీర్ఘ కాలం పాటు భూగర్భంలో ఉన్న ఆయనను నేరుగా ప్రజల ముందుకు తీసుకురావడం వల్ల ప్రభుత్వానికి కూడా సానుకూల సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారు. రాజకీయాల్లోకి వస్తున్న దేవ్ జీకి గణపతి మద్దతు లేదా ఆయన మార్గదర్శకత్వం తోడైతే కోరుట్లలో ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని గోనె వర్గం బలంగా నమ్ముతోంది. ఈ మార్పు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా ఒక సామాజిక పరివర్తనగా నిలుస్తుందని విశ్లేషిస్తున్నారు. రాబోయే రోజుల్లో దేవ్ జీ తన రాజకీయ ప్రణాళికను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఆయన గనుక ఎన్నికల బరిలో నిలిస్తే, అది కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీస్తుంది. తుపాకీ పట్టిన చేతులతో ఓటు అడగటం అనేది ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనమని గోనె ప్రకాశ్‌రావు తన ప్రసంగంలో స్పష్టం చేశారు. అడవి నుంచి అసెంబ్లీకి వెళ్లే ఈ ప్రయాణంలో దేవ్ జీకి ఎదురయ్యే సవాళ్లు, అవకాశాలు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాయి. మొత్తానికి గోనె ప్రకాశ్‌రావు చేసిన ఈ ప్రకటన అటు రాజకీయ వర్గాల్లో, ఇటు మావోయిస్టు సానుభూతిపరుల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. దేవ్ జీ కోరుట్ల బరిలో దిగడం ఖాయమైతే, ఇతర పార్టీలు తమ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుంది. సిద్ధాంతాల వేదిక నుంచి ఓట్ల వేదిక మీదకు మారుతున్న ఈ నేతల ప్రస్థానం ఎటు దారితీస్తుందో తెలియాలంటే ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే. ప్రజాసేవ కోసం ఏ మార్గాన్ని ఎంచుకున్నా, అల్టిమేట్ గా అది ప్రజల హితం కోసమే కావాలని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు.

## 55వ జాతీయ భద్రతా ర్యాలీని నిర్వహించిన ఎన్‌టిపిసి




**విశాలభారతి, ఎన్ టిపిసి:**

55వ జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా ఎన్ టి పి సి తెలంగాణ భద్రతా ర్యాలీని నిర్వహించారు. సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన కార్యాలయాన్ని నిర్ధారించడంపై దాని నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ ర్యాలీ సురక్ష కేంద్రం నుండి ప్రారంభమై సర్వీస్ భవనంలో 500 మందికి పైగా ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ కార్మికుల ఉత్సాహంతో పాల్గొన్నారు.ఈ ర్యాలీ పాల్గొనేవారు భద్రతా నినాదాలు చేశారు మరియు సురక్షితమైన పని పద్ధతులను ప్రోత్సహించే మరియు వృత్తి భద్రతపై అవగాహనను వ్యాప్తి చేసే బ్యానర్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో, ఏజెన్సీ కార్మికుడు శ్రీ సారయ్య, ఎన్ టి పీ సీ లో ప్రవర్తనా భద్రతపై తెలుగు పాటను ప్రదర్శించారు, దీనిలో పాల్గొన్నావారు ఎంతో అభినందించారు.అలాగే ఈ సమావేశానికి హాజరైన జీఎం లు మరియు హెచ్ ఓ డిల నుండి ప్రశంసలు అందుకున్నారు.భద్రత పట్ల నిబద్ధతను బలోపేతం చేయడానికి భద్రతా ప్రతిజ్ఞను మూడు భాషలలో ఏర్పాటు చేశారు.తెలుగులో ఇ . సాయి కిషోర్, ఏ జి యం సి &ఐ హిందీలో జీఎం ప్రాజెక్ట్ బినోయ్ జోస్ మరియు ఇంగ్లీష్‌లో జీఎం మెయింటెనెన్స్ అవిజిత్ దత్తా భాషల్లో వివరించారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ముకుల్ రాయ్, జీఎం (ఓ అండ్ ఎం) భద్రత అనేది ఒక సమిష్టి బాధ్యత అని మరియు ప్లాంట్‌లోని అన్ని కార్యకలాపాలలో అగ్ర ప్రాధాన్యతగా ఉండాలని చెప్పారు. ప్రమాదాలను నివారించడానికి భద్రతా విధానాలకు కట్టుబడి ఉండటం, వ్యక్తిగత రక్షణ పరికరాల సరైన ఉపయోగం మరియు వర్క్ పర్మిట్ వ్యవస్థలను ఖచ్చితంగా పాటించడం చాలా అవసరమని ఆయన తెలియజేశారు . ప్రవర్తనా భద్రత, ప్రమాద గుర్తింపు మరియు అసురక్షిత పరిస్థితులను ముందుగానే నివేదించడం, బలమైన భద్రతా సంస్కృతిని నిర్మించడంలో ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ కార్మికులు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన చెప్పారు. జీరో హార్మ్ లక్ష్యాన్ని సాధించడంలో ఎన్‌టిపిసి నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు మరియు అందరికీ సురక్షితమైన కార్యాలయాన్ని నిర్ధారించడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు.

## పాఠశాలకు బెంచీలు, పరీక్ష ప్యాడ్లు – సీసీ కెమెరాల అందజేత

**మహబూబాబాద్, విశాలభారతి:**



కురవి మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సూధనపల్లి ఐక్యతే శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు బెంచీలు, పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేయడంతో పాటు పాఠశాల మరియు గ్రామ పంచాయతీకి సీసీ కెమెరాలు అందజేశారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరావత్ వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా సినీ కళామతల్లి ముద్దుబిడ్డ, నంది అవార్డు గ్రహీత రాగిణి, రేడియో జాకీ మరియు వ్యాఖ్యాత వేణు శ్రీరామ్, కవి, సినీ రచయిత, జ్యోతిష్య నిపుణుడు బొల్లోజు భరత్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా సిరోల్ ఎస్సై గండ్ర సంతోష్ హాజరయ్యారు. అలాగే మహబూబాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై గండ్ర సంతోష్ మాట్లాడుతూ తాము చదివిన పాఠశాల అభివృద్ధికి, పుట్టిన గ్రామానికి సేవ చేయాలనే ఆలోచనతో సూధనపల్లి ఐక్యతే శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధి కోసం యువత ముందుకు రావడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. సినీ నటి రాగిణి మాట్లాడుతూ తాము చదివిన పాఠశాలకు సేవ చేయడం గొప్ప విషయం అని అన్నారు. పుట్టిన ఊరికి తమ వంతు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సూధనపల్లి ఐక్యతే శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు సినీ దర్శకులు నీలం రాజు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో స్థాపించిన ఈ సంఘం మొదటి నుంచే ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పాఠశాలకు బెంచీలు, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, అలాగే పాఠశాల మరియు గ్రామ పంచాయతీకి సీసీ కెమెరాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏ. మధుసూదన్, కోశాధికారి ఎన్. ఉపేందర్, ఉపాధ్యక్షులు మరియు సంయుక్త కార్యదర్శి మద్దెల రాంప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే సూధనపల్లి గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న, ఉపసర్పంచ్ వెంపటి విజయ్, వార్డు సభ్యులు ఏ. లింగన్న, వెంపటి దుర్గయ్య, వీ. అరుణశేఖర్, సందు కృష్ణవేణి, వెంకన్న, గంగాధరి రజిత వెంకట నరసయ్య, గాండ్ల రజిత సతీష్ పాల్గొన్నారు. ఇక ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్ కుమార్, ఎండి. అంజద్ పాషా, జి. బాలరాజు, బి. సరోజ, వి. శుభ, కే. సారంగం, ఏ. ప్రగతి, గ్రామ పెద్దలు, గ్రామ కమిటీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభం



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంగారిగూడెం గ్రామపంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ భుక్య మారుని గోపా నాయక్ ఆధ్వర్యంలో మొదటి రోజు ప్రభుత్వ పాఠశాల మరియు అంగన్వాడీ కేంద్రాలలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ భుక్య మారోని గోపా నాయక్ పిలుపునిచ్చారు. పాఠశాల ప్రాంగణం, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను శుభ్రపరచి పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యకు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రమీల గాంధీ నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, యువకులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు సూచించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**మోదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేయడం ప్రభుత్వ లక్ష్యమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ 14వ వార్డులో బత్తుల నరసింహ, సుశీల దంపతుల కుమార్తె బత్తుల ప్రశాంతి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేదలకు సొంత గృహం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్‌గౌడ్, 16వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాస్ గౌడ్, షాదీఖానా చైర్మన్ ఎండి కరీం, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, ఆవుల యేసు, ఎండి ఎజాస్, కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

**మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీత రమేష్**



**చిట్యాల, విశాలభారతి:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ ప్రజా సమస్యలను తెలియజేసే జర్నలిస్టుల యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చిట్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీత రమేష్,వైస్ చైర్ పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు అన్నారు.చిట్యాల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం టీ యు డబ్ల్యూ జె (హెచ్ 143) అధ్యక్షులు రేగొండ వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఇటీవల వారు బాధ్యతలు స్వీకరించినందున ఇరువురికి సన్మానం చేశారు.అనంతరం జర్నలిస్టులందరి సౌలభ్యం కోసం జర్నలిస్టు కమ్యూనిటీ హాల్ నిర్మాణం,ప్రెస్ క్లబ్ ఏర్పాటు కై తగిన స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను జర్నలిస్టులే ప్రజల్లోకి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా కూడా చేయడంలో జర్నలిస్టు ముఖ్య భూమిక పోషిస్తారనడం లో సందేహం లేదన్నారు.ప్రజా సమస్యలు ప్రభుత్వం కార్యక్రమాలే కాకుండా ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ వార్తల రూపంలో తెలియజేస్తారన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో స్థానిక జర్నలిస్టులు పాలుపంచుకోవాలని సలహాలు సూచనలు అందజేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని,ప్రభుత్వం జర్నలిస్టులకు ప్రాధాన్యతనిస్తుందని, జర్నలిస్టులకు ఉపయోగపడే విధంగా జర్నలిస్టుల కమ్యూనిటీ హాల్, ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీ యు డబ్ల్యూ జె (హెచ్ 143) చిట్యాల మండలం అధ్యక్షులు రేగొండ వేణుమాధవ్,టీ ఇ ఎం జె యు నియోజక వర్గ అధ్యక్షులు కొల్లోజు శ్రీకాంత్, టీ యు డబ్ల్యూ జె కోశాధికారి బొడిగె విజయ్ కుమార్, కార్యదర్శి మూడ వెంకటాద్రి, అంతటి నాగరాజు, దేశగాని సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆరోపణలు అసత్యం

**రాఘవ కన్స్ట్రక్షన్స్ ప్రతినిధులు**




**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ మండలంలోని మానస హిల్స్ ప్రాంతంలో అక్రమ క్వారీలు నిర్వహిస్తున్నాయన్న ఆరోపణలను రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి టీ . హరీష్ రావు మరియు ఇతర బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని వారు తెలిపారు. శుక్రవారం మానస హిల్స్‌లోని కంపెనీ సైట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్ఆర్డీసీఎల్ రోడ్స్ - రాఘవ కన్స్ట్రక్షన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ డి. గోపాలకృష్ణ, తిరుమల మెటల్ ఇండస్ట్రీస్ యజమాని కుమార్ రాజా మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ వ్యవహారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి గానీ, రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థకు గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇది కేవలం మంత్రి ఇమేజ్‌ను దెబ్బతీయడానికి బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న రాజకీయ కుట్ర మాత్రమేనని ఆరోపించారు. 2022-23 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బుద్వేల్‌లో 100 ఎకరాల భూమిని హైదరాబాద్ మెట్రోపోలీటన్ డెవలప్మెంట్ అథారిటీ వేలం వేసిందని తెలిపారు. ఆ భూమిలో లేఔట్ డెవలప్మెంట్ పనుల కాంట్రాక్టును యన్ సీ సీ లిమిటెడ్ సంస్థకు అప్పగించారని పేర్కొన్నారు. లేఔట్ పనుల సమయంలో బయటపడ్డ రాళ్లను కోత్వాల్‌గూడ ప్రాంతంలో డంప్ చేయడం జరిగిందని, ప్రస్తుతం అదే డంప్ చేసిన రాళ్లను మాత్రమే క్రషింగ్ చేస్తున్నారని చెప్పారు. కొత్తగా ఎలాంటి క్వారీ తవ్వకాలు జరగడం లేదని స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఎటువంటి బ్లాస్టింగ్‌లు గానీ, మైనింగ్ కార్యకలాపాలు గానీ జరగలేదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతంలో ఒక్క కొత్త క్వారీకి కూడా అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. వృథాగా పడి ఉన్న రాళ్లను మాత్రమే తిరుమల మెటల్ ఇండస్ట్రీస్ ద్వారా క్రషింగ్ చేస్తున్నామని వివరించారు. రోడ్డు పనులకు సంబంధించి రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు చెల్లించే బిల్లుల్లో ప్రభుత్వం నిర్ణయించిన రాయల్టీని పూర్తిగా వసూలు చేస్తున్నారని, అన్నీ ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగానే జరుగుతున్నాయని తెలిపారు. ఆధారాలు లేకుండా తమ కంపెనీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కూడా కంపెనీ ప్రతినిధులు హెచ్చరించారు.

# పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి




**జోనల్ కమిషనర్ మకరందు**

**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో 99వ రోజు ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా మొదటి రోజు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మకరందు, రాజేంద్రనగర్ సర్కిల్ కమిషనర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, నిర్దేశించిన డస్ట్ బిన్‌లలోనే వేయాలని జోనల్ కమిషనర్ మకరందు సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం కూడా బాగుంటుందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు కాలనీలు, రోడ్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు. ప్రజా పాలనా కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అనంతరం అక్కడికి వచ్చిన సిబ్బందితో కలిసి అధికారులు పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరిస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ కమిషనర్ సురేందర్ రెడ్డి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోలేటి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**రూ.5 లక్షల అంచనా వ్యయంతో పనులను ప్రారంభించిన సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగా రెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, చిన్న రవిర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని శుక్రవారం రాజు గోలేటి గ్రామంలో రామాలయం సమీపంలో సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ప్రారంభించారు.గ్రామ ప్రజలకు రాకపోకలు సులభం కావడంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ రోడ్డు ఉపయోగపడుతుందని గ్రామ సర్పంచ్ బాలకిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు ఆకిటి రామకృష్ణారెడ్డి, నా రెడ్డి రిషిత, సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారు సత్యనారాయణ, చెరుకు భాగ్యమ్మతో పాటు గ్రామ పెద్దలు, స్థానికులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానించిన మంత్రి పొంగులేటి

- **అశ్వారావుపేట పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం**
- **అశ్వారావుపేట మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో మర్యాదపూర్వక భేటీ**
- **ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా పని చేయాలని సూచన**
- **పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**



**అశ్వారావుపేట, విశాలభారతి :** అశ్వారావుపేట మున్సిపల్ పాలకవర్గ సభ్యులు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే దిశగా కృషి చేయాలని, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అన్నారు. అశ్వారావుపేట పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా పనిచేస్తే ప్రభుత్వం ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ఆయన మార్గదర్శకత్వంలో కృషి చేస్తామని తెలిపారు.

# న్యూ మెటీరియల్స్ ను సందర్శించిన సీబీఐటీ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు

**హైదరాబాద్:** చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లోని కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 2026 మార్చి 6న హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో ఉన్న ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ ను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా. సి. వి. నరసింహులు గారి మార్గదర్శకత్వంలో, విభాగాధిపతి డా. ఎం. ముకుంద వాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థులకు ఆధునిక పరిశోధనా సదుపాయాలు మరియు కెమికల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన పరిశ్రమల అనువర్తనాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పరిశ్రమ పర్యటనలో మూడవ సంవత్సరం కెమికల్ ఇంజినీరింగ్‌కు చెందిన 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు డా. బి. గణేష్, డా. నాగ ప్రపూర్ణ మరియు శ్రీమతి అనిత పాల్గొని పర్యటనను సమన్వయం చేసి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పర్యటన సందర్భంగా ఏఆర్‌సీఐ అధికారులు విద్యార్థులను ఆహ్వానించి సంస్థలో జరుగుతున్న పరిశోధన కార్యక్రమాలు మరియు సాంకేతిక అభివృద్ధులపై విస్తృతంగా వివరించారు. ఈ పరస్పర చర్య సమావేశాన్ని ఎ ఆర్ సి ఐ డైరెక్టర్ డా. ఆర్. విజయ్ నేతృత్వంలో నిర్వహించారు. ఆయనతో పాటు డా. సంజయ్ భారద్వాజ్ (సైంటిస్ట్ & హెడ్), శ్రీ గణేష్ (హెచ్ ఆర్ ) , శ్రీ ఎ. శ్రీనివాస్ (సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ పర్సనల్ ఆఫీసర్) మరియు ఇతర బృంద సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాలు తరగతి గది బోధన మరియు పరిశ్రమల అనుభవాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి, విద్యార్థుల్లో ప్రాయోగిక జ్ఞానం, పరిశోధనాభిరుచి మరియు కెరీర్ అవగాహన పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేయాలి

- **మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
- **మార్చి చివరి నాటికి ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశాలు**
- **99 రోజుల ప్రత్యేక కార్యాచరణపై ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం**
- **రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు**
- **మధ్యాహ్న భోజనంలో చికెన్ స్థానంలో చేపలు అందించేందుకు చర్యలు**




**ఖమ్మం, విశాలభారతి:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి అధ్యక్షత వహించగా, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారే ఆది నారాయణ, మాలోతు రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 99 రోజుల కార్యాచరణలో చేపట్టే కార్యక్రమాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 99 రోజుల కార్యాచరణను సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం పేదల సంక్షేమం, గ్రామాభివృద్ధి, వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజలకు గడపగడపకు చేరేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, భద్రాచలం ఐటిడిఎ పీవో బి. రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వైఢూర్యాపురం వైభవం మసకబారుతోంది

**పురాతన కోటలు, ఆలయాలు శిథిలావస్థలో పునరుద్ధరణకు గ్రామస్తుల విజ్ఞప్తి**



**ఆదిలాబాద్ , విశాలభారతి:**

ఆదిలాబాద్ జిల్లా నేరేడిగొండ మండలంలోని వడూర్ గ్రామం ఒకప్పుడు ఘనమైన చరిత్రను సొంతం చేసుకున్న వైఢూర్యాపురంగా ప్రసిద్ధి చెందింది. సిరిసంపదలతో తులతూగి, అద్భుతమైన శిల్పకళా వైభవంతో విరాజిల్లిన ఈ ప్రాంతం కాలక్రమేణా కాలగర్భంలో కలిసిపోయి ప్రస్తుతం ఒక సాధారణ గ్రామంగా మిగిలిపోయింది. చరిత్ర పుటల్లో కూడా సరైన స్థానం పొందకుండా నిరాదరణకు గురైన ఈ ప్రాంతంలో ఒకప్పుడు మహానగరానికి సమానమైన వైభవం ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య, ఎత్తైన కొండలతో చుట్టుముట్టబడి పచ్చని ప్రకృతి నడుమ ఈ గ్రామం ఉంది. ప్రస్తుతం సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో వ్యవసాయమే ప్రధాన వృత్తి. అయితే ఈ సాధారణ గ్రామం వెనుక ఒక గొప్ప చారిత్రక నేపథ్యం దాగి ఉంది. ఇక్కడ ఉన్న వైఢూర్యాపురం కోట ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కొంతమేర మిగిలిన గోడలు, ప్రవేశ ద్వారం మాత్రమే ఈ కోట వైభవాన్ని గుర్తు చేస్తున్నాయి. శాతవాహనుల కాలం నుండి వెంకటరాయుడి కాలం వరకు ఈ ప్రాంతం వర్తక, వాణిజ్యాలకు ప్రధాన కేంద్రంగా కొనసాగిందని చరిత్రకారులు పేర్కొంటున్నారు. అప్పట్లో వెయ్యి గడపలు గల మహానగరంగా వైఢూర్యాపురం పేరుగాంచింది. నిర్మల్ వంటి పట్టణాల అభివృద్ధికి అవసరమైన ధనభాండాగారం ఇక్కడే ఉండేదని కూడా చెబుతున్నారు. చుట్టూ సహజ రక్షణగా నిలిచే కొండలు ఉండటం వల్ల పాలకులు తమ రాజ్య ఖజానాను ఇక్కడ భద్రపరచేవారని చరిత్ర పేర్కొంటోంది. శత్రువుల దాడులను తట్టుకునేందుకు గ్రామం చుట్టూ పెద్ద కందకం తవ్వించారని, ఆ కందకం ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అప్పట్లో వజ్రాలు, వైఢూర్యాలు వంటి రత్నాలను కూడా ఇక్కడి సంతల్లో రాశులుగా పోసి విక్రయించేవారని, అందుకే ఈ ప్రాంతానికి వైఢూర్యాపురం అనే పేరు వచ్చిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కాలక్రమేణా వైఢూర్యాపురం పేరు వడూర్‌గా మారింది. చరిత్ర ప్రకారం ఒకప్పుడు ఈ గ్రామంలో 999 గడపలు ఉండేవని చెబుతారు. ఆ సంఖ్య శుభం కాదని భావించి వెయ్యి గడపలు పూర్తి కావాలని సంకల్పంతో గ్రామంలో సంగమేశ్వర ఆలయాన్ని నిర్మించారని చెబుతారు. ప్రస్తుతం ఈ సంగమేశ్వర ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఆలయ అవశేషాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే ఆలయంలోని విగ్రహాలు ఇప్పటికీ అప్పటి అద్భుతమైన శిల్పకళను ప్రతిబింబిస్తున్నాయి.

# ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ దాడులను ఖండించిన సిపిఎం

- **సిపిఎం ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ**
- **యుద్ధ చర్యలను నిలిపి శాంతి చర్చలు చేపట్టాలని డిమాండ్**
- **ఐక్యరాజ్యసమితి తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**




**సత్తుపల్లి, విశాలభారతి :**

ఇరాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయిల్ చేపడుతున్న దాడులను ఖండిస్తూ సిపిఎం నాయకులు సత్తుపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం సత్తుపల్లి పట్టణ, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాసులు మాట్లాడుతూ, ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దురాక్రమణ దాడులు తీవ్రంగా ఖండనీయమన్నారు. అమెరికా సామ్రాజ్యవాద ధోరణితో వివిధ దేశాలపై దాడులు కొనసాగించడం తప్పుడు చర్య అని పేర్కొన్నారు. ఇప్పటికే ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేసి వేలాది మందిని హతమార్చిందని తెలిపారు. ఇప్పుడు ఆయిల్ ఆధిపత్యం కోసం ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందనే నెపంతో అమెరికా-ఇజ్రాయిల్ కలిసి దాడులు జరపడం ఆందోళనకరమని అన్నారు. ఈ దాడుల్లో ఉన్నతాధికారులు, వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, పాఠశాలలపై దాడులు చేసి విద్యార్థులను హతమార్చడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. వెంటనే యుద్ధ చర్యలను నిలిపివేసి శాంతి చర్చలు ప్రారంభించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకుని యుద్ధాన్ని నివారించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలి సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, బాల బుచ్చయ్య, బండి వేలాద్రి, మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, బండి రఘుపతి రెడ్డి, మల్లికార్జున్, వెంకటేశ్వరరావు, గుదే రాము, జిలాని, నబి, రాంబాబు, రత్నకుమారి, పుష్పవల్లి, బసవమ్మ, బెజవాడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద తల్లి ప్రాణాలను కాపాడాలని విన్నపం

- **కిడ్నీ, థైరాయిడ్, గుండె సమస్యలతో ఏడాది నుంచి బాధపడుతున్న భ్రమరాంబ**
- **చికిత్స కోసం అప్పులు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగిన కుటుంబం దయనీయ స్థితి**
- **సహాయం చేయాలనుకునే దాతలు ఫోన్‌పే ద్వారా సహకరించాలని కుటుంబ సభ్యుల అభ్యర్థన**



**అశ్వారావుపేట, విశాలభారతి:**

దమ్మపేట మండలం అర్బన్ కాలనీకి చెందిన కాళహస్తి భ్రమరాంబ (భర్త రామారావు) తీవ్ర అనారోగ్యంతో ఏడాది కాలంగా మంచానికే పరిమితమై ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. కిడ్నీ, థైరాయిడ్ మరియు గుండె సంబంధిత సమస్యలతో ఆమె బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన భ్రమరాంబ చికిత్స కోసం కుటుంబ సభ్యులు అప్పులు చేసి అశ్వారావుపేట, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్ నగరాల్లోని పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఇప్పటివరకు ఉన్నదంతా ఖర్చైపోవడంతో ప్రస్తుతం ఆసుపత్రికి వెళ్లడానికి కూడా డబ్బుల్లేని దయనీయ పరిస్థితి నెలకొంది. తల్లి ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఏమీ చేయలేని పరిస్థితిలో కుటుంబ సభ్యులు దాతల సహాయానికి ఎదురు చూస్తున్నారు. ప్రజలు చేసే చిన్న సహాయం కూడా ఆ తల్లి ప్రాణాన్ని కాపాడడమే కాకుండా ఆ నిరుపేద కుటుంబానికి గొప్ప అండగా నిలుస్తుందని వారు తెలిపారు. సహాయం చేయాలనుకునే దాతలు ఫోన్‌పే నంబర్ 9133825137కు ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ ఫోన్‌పే ఖాతా కాళహస్తి భ్రమరాంబ కుమారుడు కాళహస్తి బాలాంజనేయులు పేరుతో నమోదై ఉందని వారు తెలిపారు.

# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి:** అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు . శుక్రవారం అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన పనులను సమగ్ర ప్రణాళికతో అమలు చేసి లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, వైద్య ఆరోగ్య సేవల విస్తరణ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం తదితర కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాల అమలును జిల్లా స్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తామని, అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పాల్గొని ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

# భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు



**కొత్తగూడెం లీగల్, విశాలభారతి:** భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా... చుంచుపల్లి మండలం విద్యానగర్ కు చెందిన లాకవత్ సైదులు తన పెద్ద కూతురైన స్నేహా ను క్రితము ఖమ్మం జిల్లా, ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుల్లూరు గ్రామం కట్టుకుంట తండా నివాసి అయిన భూక్య శ్రీధర్ కు ఇచ్చి 2021 జులై 30 న వివాహం జరిపించినారని వారం రోజుల వరకు బాగానే ఉన్నారని భర్త అత్త మామ వేధింపులు భరించలేక ఇంటికి పంపించగా భరించలేక వచ్చిన తర్వాత విషయం సర్ది చెప్పి కుటుంబ సభ్యులతో మాట్లాడి పంపించినారు. అయినా కూడా వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని మూడు నెలల క్రితం మా ఇంటికి వచ్చి ఇంటి వద్దనే ఉంటుందని 2, 23 మే 25 తాను తన భార్య కావేరి కూలి పనులకు వెళ్లారు తన ఇంట్లో తన పెద్ద కూతురు స్నేహ చిన్న కూతురు నీలా కొడుకు డేవిడ్ లను ఇంటి వద్ద ఉంచి వెళ్ళినారూ . 2023 మే 20 న. ఉ 11 గంటల ప్రాంతంలో భూక్య శ్రీధర్ పెట్రోల్ తో వచ్చి తన పెద్ద కూతురు అయిన స్నేహా పై పెట్రోలు పోసి నిప్పంటించాడని తన చిన్న కూతురు నీల పక్కింటి లక్ష్మీనారాయణ సెల్ ఫోన్ ద్వారా తన భార్యతో చెప్పగా తన భార్య తనకు చెప్పినదని కాలిన గాయాలతో పడి ఉండగా ఇంటికి వచ్చి చూసి గాయాల తో ఉన్న నా కూతురూ ను హాస్పిటల్ కు తీసుకెళ్లి ట్రీట్మెంట్ చేసిన తదుపరి చనిపోయినదని, గార్ల మండలం, పుల్లూరు గ్రామం,కట్టుకుంట తండాకు చెందిన తన భర్త భూక్య శ్రీధర్,అత్త భూక్య అచ్చమ్మ మామ భూక్య బాసు @ భాస్కర్ లపై చుంచు చుపల్లి పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కే. సుమన్ కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి ఇన్స్పెక్టర్ ఏ. రమాకాంత్ దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 17 మంది సాక్షులను విచారించిన విచారించారు. భూక్య శ్రీధర్ పై నేరం రుజువు కాగా అతనికి జీవిత ఖైదు మరియు వెయ్యి రూపాయల జరిమానా, జరిమానా చెల్లించని యెడల 6 నెలల శిక్ష విధిస్తూ భూక్య అచ్చమ్మ భూక్య బాసు భాస్కర్ ల పై నేరం రుజువు కానందున కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ ఎన్ .వీరబాబు (కోర్టు డ్యూటీ ఆఫీసర్) హెచ్. సి.లు లచ్చూ , పి సుమన్ లు సహకరించారు.

# సంతు సేవాలాల్ జయంతి ప్రభుత్వం నిర్వహించటం పట్ల నిరసన

**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం గిరిజన భవన్ లొ ప్రభుత్వం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి సభ కు అంబేద్కర్ సెంటర్ లొ నిరసన తెలిపిన ఆదివాసీ సంక్షేమ పరిషత్. తుడుందెబ్బ సంఘాలు... ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు. వి సి. దొర ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం లొ తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు. ముక్తి రాజు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు.తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ కోడెం వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణా ప్రాంతానికి ఎటువంటి సంబంధం లేని సంత్ సేవాలాల్ జయంతి తెలంగాణ ఏజెన్సీ ప్రాంతంలో పాలక ప్రభుత్వం నిర్వహించడం ఆదివాసీ ఉద్యమకారులను తెలంగాణ సాయుధ పోరాట యోధులను అవమానిచ్చినట్లే అని అన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యే లకు ఆదివాసీ ఉద్యమకారులు ఉద్యమాలు కనిపించవు. భద్రాచలం వేదికగా ఆదివాసీ ధర్మ యుద్ధం సభ పెడితే హాజరు కాలేని భద్రాచలం ఎమ్మెల్యే లంబాడిలా సభకు వెళ్లడం చాలా విచారకరం.కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలను అణిచివేయడాని మహబూబ్ నగర్ సంత్ సేవాలాల్ గుడి కడుతూ. భద్రాచలం లొ జయంతి సభలు పెడుతూ ఏజెన్సీ మొత్తం లంబాడీల మయం చేసే కుట్రలో ఆదివాసి ఎమ్మెల్యే లు ఒక్కరు కుడా నోరు విప్పే పరిస్థితి లేదు ఇటువంటి ప్రజా ప్రతినిధులను రాబోవు ఎన్నికలలో చిత్తు చిత్తుగా ఓడించి ఏజెన్సీ లొ కాంగ్రెస్ పార్టీని గల్లంతు చేయాలనీ ఆదివాసీ సమాజానికి పిలుపునిచ్చారు. ఆదివాసీ ల ఆరాధ్య దైవం కుపార్ లింగో ఆదివాసీ ఆచార వ్యవహారాలు గొట్టు గోత్రలా సృష్టి కర్త ని గుర్తించాల్సిన బాధ్యత మరిచిన పాలకులను మన ప్రాంతాలలో తిరగనివ్వొద్దు అని అన్నారు... ఈ కార్యక్రమంలో రేసు నారాయణ మూర్తి.గుమ్మడి కుమార్. పుల్సాం భద్రయ్య. ఏ ఎస్ పి జిల్లా కార్యదర్శి కుర్సం రవి. తదితరులు పాల్గొన్నారు.





# సుశాంత్‌తో ప్రేమ .. గాసిప్స్‌పై మీనాక్షి చౌదరి క్లారిటీ

ప్రస్తుతం టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల విజయ్‌రష్మిక వివాహం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అలాగే మార్చి 6న అల్లు శిరీష్- నయనిక రెడ్డి వివాహం జరగనుండటంతో సినీ వర్గాల్లో పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇదే సమయంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి వ్యక్తిగత జీవితంపై కూడా కొన్ని గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వాటిపై స్పష్టత ఇచ్చారు. తన అందం, నటనతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించిన హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఆసక్తికర విషయం ఏమిటంటే, చాలా మంది నటీనటులు డాక్టర్ అవ్వాలని అనుకుని సినిమాల్లోకి వచ్చామని చెబుతుంటారు. కానీ మీనాక్షి మాత్రం నిజంగానే డెంటిస్ట్ చదివి తర్వాత సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ సినిమాల్లో ముందుకు సాగారు. 2019లో వచ్చిన హిందీ సినిమా అప్‌స్టార్ట్స్ ద్వారా మొదటిసారి తెరపై కనిపించిన మీనాక్షి, 2021లో వచ్చిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఖిలాడీ, హిట్ : ది సెకండ్ కేసు, గుంటూరు కారం వంటి చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన లక్కీ భాస్కర్ ఆమెకు మంచి పేరు తెచ్చింది. అలాగే వెకంటేష్‌తో కలిసి చేసిన సంక్రాంతికి వస్తున్నాం కూడా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు మాత్రమే కాకుండా తమిళంలో కూడా ఆమె పలు సినిమాల్లో నటించారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్న 'వృషకర్మ' సినిమాలో మీనాక్షి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆమె లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా, కొంతకాలంగా మీనాక్షి చౌదరి ఒక తెలుగు హీరోతో రిలేషన్‌లో ఉన్నారని గాసిప్స్ వినిపించాయి. ఆ హీరో మరెవరో కాదు సుశాంత్. వీరిద్దరూ కలిసి నటించినఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమా షూటింగ్ సమయంలో స్నేహం పెరిగి అది ప్రేమగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా స్పందించిన మీనాక్షి, వాటిని పూర్తిగా ఖండించారు. సుశాంత్‌తో తనకు ప్రేమ సంబంధం లేదని, అతను మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై గాసిప్స్ ఎక్కువ కావడంతో మీనాక్షి టీమ్ కూడా స్పందించి ఇద్దరూ కేవలం ఫ్రెండ్స్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది.

# శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు

**శేరిలింగంపల్లి-విశాల భారతి**

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు సోదాలు చేస్తున్నారు.ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఐదు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేస్తున్నారు. ఉద్యోగులేవరిని బయటికి వెళ్లకుండా ఆపేశారు. శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ విభాగంపై గత పది నెలల కాలంగా తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అడ్డు అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతుండడం, నియంత్రించే ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో ఆయా విభాగాల అధికారులు సిబ్బందికి ముచ్చమటలు పట్టిస్తుంది.టౌన్ ప్లానింగ్ విభాగంతో పాటు ఇంజనీరింగ్ శానిటేషన్, బయోడైవర్సిటీ తదితరు విభాగాలలో బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు గుర్తించి నోటీసులు జారీ చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదని పెద్ద ఎత్తున ఆరోపణలు వెలువత్తాయి.సోకాజ్ నోటీసు జారీ చేస్తున్న అధికారులు వివరణ పేరుతో బేరసారాలకు దిగడం, పట్టించుకోని నిర్మాణ దారులకు స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. పది నెలల కాలంలో సుమారు 450 నోటీసులు జారీచేసిన అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశంపై ప్రశ్నిస్తున్నట్లుగా తెలిసింది. అంజయ్య నగర్,గచ్చిబౌలి,జెవి హిల్స్, రాఘవేంద్ర, రాజరాజేశ్వరి కాలనీ, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో సీజ్ చేసిన భవనాలు సైతం బోర్డులు తొలగించి నిర్మాణాలు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మతలబు ఏంటన్న దానిపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.సుదీర్ఘకాలం అనుమతులు పెండింగ్ లో పెట్టడం, జారీ చేసిన నోటీస్ లకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు,సీజ్ చేసిన భవనాలు తిరిగి నిర్మించడంపై ప్రధానంగా ఫోకస్ పెట్టినట్లు సమాచారం. డిఎస్పి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం టౌన్ ప్లానింగ్ విభాగం, ఇంజనీరింగ్ , పారిశుధ్యం విభాగంలో సోదాలు చేస్తున్న అధికారులు ఉద్యోగుల నుంచి వివరాలు రాబడుతున్నట్లు తెలిసింది. వివిధ ఫైళ్లు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.